

# మన బడి

## మాస పత్రిక


సంపుటి: 1    సంచిక: 11    అక్టోబర్ – 2025    పేజీలు: 24





# కొలువు సాధించిన గురువులు

# MEGA DSC



















**"15 సంవత్సరాల్లో 14 సార్లు డీఎస్సీ పెట్టి 1,96,619 మందికి ఉద్యోగాలు ఇచ్చింది నేనే. మెగా డీఎస్సీపై తొలి సంతకం చేసి, 15,941 ఉద్యోగాలు భర్తీ చేశాం"** – మెగా డీఎస్సీ -2025 నియామక పత్రాల పంపిణీలో గౌరవ సీఎం చంద్రబాబునాయుడు

**గౌరవ సలహాదారులు**
**కోన శశిధర్,** ఐ.ఎ.ఎస్.,
సెక్రటరీ, పాఠశాల విద్యాశాఖ
**విజయరామరాజు.వి,** ఐ.ఎ.ఎస్.,
డైరెక్టర్, పాఠశాల విద్యాశాఖ
**పి.రంజిత్ బాషా,** ఐ.ఎ.ఎస్.,
డైరెక్టర్, ఇంటర్మీడియెట్ విద్య
**ఎడిటర్**
**బి.శ్రీనివాసరావు,** ఐ.ఎ.ఎస్.,
స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్, సమగ్ర శిక్షా
**సలహాసభ్యులు**
**వి.ఎన్.మస్తానయ్య**, డైరెక్టర్, SIEMAT
**ఎం.ఆర్.ప్రసన్నకుమార్,** ASPD –1
**డి.దేవానందరెడ్డి,** సెక్రటరీ, KGBV
**డి.మధుసూదనరావు,** డైరెక్టర్, AP Text Books Press
**కె.నాగేశ్వరరావు,** అడిషనల్ డైరెక్టర్, SAMO
**కె.రవీంద్రనాథ్ రెడ్డి,** ASPD –2
**వి.మనోహర్ నాయక్,** CMO
**కె.జీవనజ్యోతి,** సూపరింటెండెంట్, PRO
**వర్కింగ్ ఎడిటర్**
**చల్ల మధుసూదనరావు,** మీడియా కన్సల్టెంట్
**చీఫ్ సబ్ ఎడిటర్**
**గణపతి రావు బెహరా,** PRO
**ఎడిటోరియల్ కమిటీ**
**డా. ఎస్.వి. లక్ష్మణరావు,**టీఎస్‌జీ (సీఎంవో)
**పైడి.వెంకట రమణ,** సీనియర్ ప్రోగ్రామర్
**డా. కె.శారద,** శామో ఫ్యాకల్టీ
**డా. వి.సతీష్ రెడ్డి,** సీమ్యాట్ ఫ్యాకల్టీ
**డా. ఎస్.ప్రసాద్ రావు,** సీమ్యాట్ ఫ్యాకల్టీ
**జి. మహేశ్వర రెడ్డి,** సీమ్యాట్ ఫ్యాకల్టీ
**డా. టి.ఇస్మాయిల్,** దీక్ష కో ఆర్డినేటర్
**డా. కె.పెంచలయ్య,** టీఎస్‌జీ (ఆర్టీఈ)
**డా. వై.నరసింహం,** టీఎస్‌జీ(ఐఈ)
**పి.వెంకటేశ్వరరావు,** టీఎస్‌జీ (ప్లానింగ్)
**పి.గీత,** టీఎస్‌జీ(ఓఎస్‌సీ)
**డిజైనింగ్**
**గిరిధర్ అరసవల్లి**
**చిత్రకారులు**
**మల్లిక్**

# మన బడి

## మాస పత్రిక



సంపుటి: 1 సంచిక: 11 అక్టోబర్ – 2025 పేజీలు: 24

## పట్టుదల పలికిన విజయం

పదవులు కాదు, బాధ్యతలు; ఉద్యోగాలు కాదు, ఉపాధి మార్గాలు. ఇవే నేటి యువతరం ఆలోచనలు. జీవితంలో ఎన్నో ఆటుపోట్లు, ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ బాధ్యతలు ఉన్నా... తమ లక్ష్యాన్ని చేరుకోవడంలో పట్టుదల, సంకల్పం ఉంటే అసాధ్యమనేది ఏమీ లేదని నిరూపించారు ఇటీవల మెగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయులుగా ఎంపికైన వేలాది మంది అభ్యర్థులు. ఈ సంచికలో కవర్ స్టోరీ "కొలువు సాధించిన గురువులు" కేవలం నియామక ప్రక్రియ వివరాలను అందించడం లేదు, ఇది ఆత్మవిశ్వాసం, నిరంతర శ్రమతో కూడిన విజయగాథల సమాహారం.

ఒకే ఊరు నుంచి పది మందికిపైగా టీచర్లు ఎంపికవడం, ఒకే కుటుంబంలో తండ్రీకొడుకు, భార్యాభర్తలు, అక్కాచెల్లెళ్లు ఒకేసారి ఉద్యోగాలు సాధించడం చూస్తుంటే, డీఎస్సీ అనేది ఒక ఉద్యోగ జాతరలా కాకుండా, కలల సాకారంలా కనిపిస్తోంది. పల్లెటూళ్లలో ఒకరికే ప్రభుత్వ ఉద్యోగం వస్తే గొప్పగా చెప్పుకునే రోజుల్లో, లక్కవరం, తెనగల్లు వంటి గ్రామాలు ఏకంగా 25 నుంచి 40 మందికిపైగా ఉపాధ్యాయులను అందించడం చూస్తే, ఆ ప్రాంతాల్లోని యువత విద్య పట్ల ఎంత నిబద్ధతతో ఉన్నారో అర్థమవుతుంది.

ఈ గ్రామాలు రేపటి తరానికి విద్యా కేంద్రాలుగా, ఆదర్శాలుగా నిలుస్తున్నాయి. కుటుంబ బంధాలు, వృత్తి బంధాలుగా మారడం. తండ్రి పనిచేస్తున్న పాఠశాలలోనే కొడుకు ఉద్యోగం సాధించడం, అక్కాచెల్లెళ్లు ఒకే స్కూల్‌లో స్కూల్ అసిస్టెంట్లుగా చేరడం, భార్యాభర్తలు ఇద్దరూ ఒకేసారి డీఎస్సీ కొలువులు సాధించడం, ఒకే ఇంట్లో ముగ్గురు ఉపాధ్యాయులుగా ఎంపికవడం వంటివి ఈ విజయాన్ని మరింత మధురంగా మార్చాయి. ఈ విజయాలలో ముఖ్యంగా చెప్పుకోవాల్సినవి కష్టజీవుల విజయాలు. బైక్ సీట్లు కుట్టే మెకానిక్ నుండి మేస్టారుగా మారిన కర్రి నాగేశ్వరరావు, ఏడేళ్లు పెయింటింగ్, కూలి పనులు చేసినా చదువును విస్మరించని చాట్ల రత్నరాజు, తోపుడుబండి వ్యాపారి కూతురై రెండు కొలువులు సాధించిన పార్వతి, ఆర్మీ సేవ తర్వాత విద్యా సేవకు సిద్ధమైన బంటు శివ వంటి వారి ప్రయాణాలు ప్రతి నిరుద్యోగికి స్ఫూర్తిదాయకం.

అలాగే, పదో తరగతిలో పెళ్లయినా ఆగిపోని శివ స్వప్న కల, డెంగీతో భార్య మరణించినా ఆమె కోరికను నెరవేర్చడానికి పట్టుదలతో చదివిన ఆరేపల్లి రామకృష్ణ త్యాగం మన హృదయాలను తాకుతాయి. పేదరికం, కుటుంబ భారం, వ్యక్తిగత విషాదాలు వారిని వెనక్కి లాగినా, 'నాన్న కల నెరవేర్చాం' అన్న సంతృప్తి, 'భార్య కోరిక తీర్చాం' అన్న ఆనందం వారి విజయానికి అసలైన కిరీటాలు. ఈ కొత్త గురువులందరూ తమ జీవితానుభవాల నుంచే పట్టుదల, నిరాశను జయించడం, శ్రమ విలువ వంటి పాఠాలు నేర్చుకున్నారు. వారు బోధించే పాఠాలు కేవలం పుస్తకంలోని విషయాలకే పరిమితం కావు, వారి జీవిత పోరాటాలు కూడా విద్యార్థులకు జీవిత పాఠాలు అవుతాయి.

– **బి శ్రీనివాసరావు,** IAS
ఎడిటర్ & రాష్ట్ర పథక సంచాలకులు
సమగ్ర శిక్షా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

Published by the **State Project Director**, Samagra Shiksha, Andhra Pradesh.
K.B.C ZillaParishad High School (Boys) Premises, High School Road, Patamata, Vijayawada - 520 010. A.P.
For mail: manabadimagazine@gmail.com
Present : **B.Srinivasa Rao,** I.A.S., Printed at **M/s. Lakshmi Vignesh Printers,** Guntur
ఆన్ లైన్ మ్యాగజైన్ కోసం: https://schooledu.ap.gov.in/samagrashiksha/ మరియు cse.ap.gov.in

# సాంకేతిక విద్యకు సరికొత్త చిరునామా
# ఇన్ఫోసిస్ స్ప్రింగ్‌బోర్డ్




- **మంగళగిరి నియోజకవర్గంలో పైలట్ ప్రాజెక్టు**
- **38 పాఠశాలలకు 30 చొప్పున ట్యాబ్స్ పంపిణీ**
- **డిజిటల్ విద్యపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ**

భావితరాలను సాంకేతిక పరిజ్ఞానంలో ప్రతిభావంతులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, బెంగళూరు కేంద్రంగా పనిచేసే ప్రముఖ ఐటీ సంస్థ ఇన్ఫోసిస్ లిమిటెడ్ సంయుక్త భాగస్వామ్యంతో 'ఇన్ఫోసిస్ స్ప్రింగ్‌బోర్డ్' కార్యక్రమం చేపట్టాయి.

ఈ కార్యక్రమాన్ని మంగళగిరి నియోజకవర్గంలో పైలట్ ప్రాజెక్టుగా ప్రభుత్వం అమలు చేస్తూ డిజిటల్ అభ్యాసంలో నూతన అధ్యాయానికి శ్రీకారం చుట్టింది. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ స్కీములో (CSR) భాగంగా 38 అప్పర్ ప్రైమరీ, సెకండరీ పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేయనున్నారు.

### భవిష్యత్తుకు బాటలు వేస్తూ...

"భారతదేశ భవిష్యత్తు నేటి యువత చేతుల్లోనే ఉంది" అనే స్ఫూర్తితో ఇన్ఫోసిస్ స్ప్రింగ్‌బోర్డ్ కార్యక్రమం 6 నుండి 12 తరగతుల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే కాకుండా, వారిలో డిజిటల్ అక్షరాస్యత (ICTని సమర్థవంతంగా ఉపయోగించే సామర్థ్యం) ను పెంపొందించడంపై ప్రధానంగా దృష్టి పెట్టింది. సాంప్రదాయ విద్యకు డిజిటల్ జ్ఞానాన్ని జోడించడం ద్వారా విద్యార్థులను ఆధునిక ప్రపంచ సవాళ్లను ఎదుర్కొనే విధంగా సిద్ధం చేస్తున్నారు.

### సాంకేతిక వనరుల పంపిణీ


ఇన్ఫోసిస్ లిమిటెడ్ సహకారంలో భాగంగా 38 పాఠశాలలకు 30 చొప్పున ట్యాబ్స్ (పౌచ్‌లు-కమ్-స్టాండ్‌లతో సహా) పంపిణీ చేశారు. ఈ స్ప్రింగ్‌బోర్డ్ వేదిక ద్వారా చదువుకు, ఉపాధికి మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించేలా తగిన జాగ్రత్తలతో ఎంపిక చేయబడిన పాఠ్యాంశాలను విద్యార్థులకు ఉచితంగా అందిస్తున్నారు. రాష్ట్ర కరికులమ్‌కు అనుగుణంగా ఎస్సీఈఆర్టీ, సమగ్ర శిక్ష SAMO విభాగం నిపుణులు సమీక్షించి, ఆమోదించిన ఈ కంటెంట్‌లో 6 నుండి 9 తరగతుల విద్యార్థులకు సంబంధించిన గణితం, సైన్స్, ఇంగ్లీష్, లైఫ్ స్కిల్స్ చెందిన పాఠ్యాంశాలు ఉన్నాయి.

### అమలు ఇలా...

* ఈ కార్యక్రమం అమలులో కీలకపాత్ర వహించే ప్రధానోపాధ్యాయులకు, గణిత ఉపాధ్యాయులకు స్ప్రింగ్‌బోర్డ్ వేదికపై పట్టు సాధించడానికి ఒకరోజు శిక్షణ నిర్వహించడమైంది.
* ప్రతి విద్యార్థి తమ ప్రత్యేక లాగిన్ ఆధారాలతో రోజుకు కనీసం ఒక గంట పాటు టాబ్లెట్‌ను ఉపయోగిస్తారు. ఇంటరాక్టివ్ వీడియోలు, కోర్సు చివర్లో స్వీయ-మూల్యాంకన పరీక్షలు వారికి అందుబాటులో ఉన్నాయి. ప్రతి పాఠశాల ఈ స్మార్ట్ క్లాస్‌రూమ్‌లను రోజుకు కనీసం నాలుగు గంటలు ఉపయోగించుకునేలా ప్రణాళికను తయారుచేశారు.
* ఇన్ఫోసిస్ బృందం ప్లాట్‌ఫారమ్ వినియోగాన్ని క్రమం తప్పకుండా పర్యవేక్షిస్తూ, నెలవారీ నివేదికలను ప్రభుత్వానికి అందిస్తుంది.
* అత్యుత్తమ అభ్యాస ఫలితాలు సాధించిన పాఠశాలలకు ప్రశంసా పత్రాలు అందిస్తారు.

### విద్యార్థులు అవకాశాలు అందిపుచ్చుకోవాలి

"ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం డిజిటల్ విద్య అమలు ద్వారా రాష్ట్రాన్ని ఆదర్శంగా నిలబెడుతుంది. ఈ దిశగా చేపట్టే కార్యక్రమాలకు ఇన్ఫోసిస్ లిమిటెడ్ లాంటి ప్రముఖ ఐటీ సంస్థలు ముందుకు రావడం సంతోషదాయకం. విద్యార్థులు ఇన్ఫోసిస్ స్ప్రింగ్‌బోర్డ్ కార్యక్రమం సద్వినియోగం చేసుకోవాలి. ఈ దిశగా విద్యార్థులకు ఉపాధ్యాయులు దిశానిర్దేశం చేయాలి. బాగా పనిచేసిన పాఠశాలలకు సర్టిఫికెట్‌లతో సత్కరిస్తారు. అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులు ఇన్ఫోసిస్ లిమిటెడ్‌లో అప్రెంటిస్‌షిప్ అవకాశాలు పొందవచ్చు. మన విద్యార్థులు ఆ అవకాశాలు సమర్థవంతంగా అందిపుచ్చుకోవాలి."



– **బి. శ్రీనివాసరావు,** IAS.,
స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్, సమగ్ర శిక్ష






# ఉజ్వల భవితకు కొత్త దారులు... విద్యాభివృద్ధికి వినూత్న కార్యక్రమాలు

*** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ముందుచూపు * సమగ్ర శిక్షతో చేయి కలిపిన స్వచ్ఛంద సంస్థలు**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పాఠశాలలు కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా, పరిపూర్ణ విద్యతో విద్యార్థులను భవిష్యత్ ప్రపంచానికి సన్నద్ధం చేయడానికి ఒక విప్లవాత్మక మార్పునకు నాంది పలికాయి. విద్యార్థులకు 21వ శతాబ్దపు నైపుణ్యాలను, కెరీర్ అవగాహనను, డిజిటల్ అక్షరాస్యతను, వ్యవస్థాపక ధోరణిని పెంపొందించేందుకు గ్లోబల్ ఎడ్యుకేషన్ సొల్యూషన్స్, ఆంధ్రప్రదేశ్ ఎంటర్‌ప్రెన్యూర్ మైండ్‌సెట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (AP EMDP), అమెజాన్ ఫ్యూచర్ ఇంజినీర్, దేశ్ అప్నయేన్ సహయోగ్ ఫౌండేషన్, విభా – లీప్ ఫర్ వర్డ్, డెట్టాల్ బనేగా స్వస్థ్ ఇండియా వంటి స్వచ్ఛంద సంస్థలు సమగ్ర శిక్షతో చేయి కలిపాయి. పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్ష భాగస్వామ్యంతో వినూత్న కార్యక్రమాలు నిర్వహించి, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల భవితకు కొత్త దారులను తెరుస్తున్నాయి.

## గ్లోబల్ ఎడ్యుకేషన్ సొల్యూషన్స్: కెరీర్ స్పష్టతకు తొలి అడుగు

గ్లోబల్ ఎడ్యుకేషన్ సొల్యూషన్స్ (GES) స్వచ్ఛంద సంస్థ విద్యార్థుల్లో కెరీర్ నైపుణ్యాలను, 21వ శతాబ్దపు జీవన నైపుణ్యాలను, కమ్యూనికేషన్, సృజనాత్మకత వంటి నైపుణ్యాలు పెంపొందించడం, ఉపాధ్యాయుల్లో సామర్థ్యాన్ని పెంచడం వంటి లక్ష్యాలతో ఈ సంస్థ పనిచేస్తోంది. ముఖ్యంగా విద్యార్థులను భవిష్యత్తుకు సిద్ధం చేయడంలో కీలక పాత్ర పోషిస్తుంది. మెల్‌బోర్న్ యూనివర్సిటీ అభివృద్ధి చేసిన ఆస్ట్రేలియన్ బ్లూప్రింట్ ఫర్ కెరీర్ డెవలప్‌మెంట్ , ప్రొఫెషనల్ ప్రాక్టీస్ ఫర్ కెరీర్ కౌన్సెలింగ్ వంటి నమూనాలపై ఆధారంగా ఈ సంస్థ పని చేస్తుంది.



గ్లోబల్ ఎడ్యుకేషన్ సొల్యూషన్స్ సంస్థ హైదరాబాద్ ప్రధాన కేంద్రంగా, ప్రస్తుతం ఇది గుంటూరు, నెల్లూరు, ప్రకాశం, విశాఖపట్నం, విజయనగరం జిల్లాలలో తమ కార్యక్రమాలను నిర్వహిస్తోంది. మెల్‌బోర్న్ యూనివర్సిటీ నమూనా ఆధారంగా 8–12 తరగతుల విద్యార్థులకు కెరీర్ విద్య, అభివృద్ధికి సంబంధించిన పాఠ్యాంశాలను రూపొందించి, అమలు చేస్తున్నారు. AI ఆధారిత (mykensho) బహుభాషల యాప్ ఉపయోగిస్తున్నారు. ఉపాధ్యాయులకు కెరీర్ కౌన్సిలింగ్, కోచింగ్ పద్ధతుల్లో శిక్షణ ఇస్తున్నారు. ఈ శిక్షణ ఉపాధ్యాయులు విద్యార్థులకు మరింత ప్రభావవంతంగా మార్గదర్శకత్వం చేయడానికి సహాయపడుతుంది. 'టీచ్ టూల్' వంటి పద్ధతులను ఉపయోగించి తరగతి గదిలో ఉపాధ్యాయుల పనితీరును పర్యవేక్షిస్తారు. విద్యార్థుల పురోగతిని, అభ్యాస ఫలితాలను ప్రభావాన్ని అంచనా వేయడానికి ఫార్మేటివ్, సమ్మేటివ్ అసెస్‌మెంట్‌లను నిర్వహిస్తారు. ఈ విధంగా, గ్లోబల్ ఎడ్యుకేషన్ సొల్యూషన్స్ సంస్థ ద్వారా, మెల్‌బోర్న్ యూనివర్సిటీ అంతర్జాతీయ విద్యా నైపుణ్యం ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు , ఉపాధ్యాయులకు చేరుతున్నాయి. అంతేకాదు, సమగ్ర శిక్ష లక్ష్యాలకు అనుగుణంగా విద్యార్థుల సమగ్ర అభివృద్ధి, డిజిటల్ అభ్యాసం, వృత్తి విద్య, ఉపాధ్యాయుల సామర్థ్య నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తుంది. NEP 2020, NCF 2023, వికసిత్ భారత్ వంటి జాతీయ కార్యక్రమాలపై కూడా దృష్టి సారిస్తోంది.

గ్లోబల్ ఎడ్యుకేషన్ సొల్యూషన్స్ రెండు దశల్లో కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేసింది. మొదటి దశలో 2023–24 విద్యా సంవత్సరంలో దాదాపు 31,908 మంది విద్యార్థులు, 500 మంది ఉపాధ్యాయులకు ప్రయోజనం చేకూరింది. రెండో దశ 2024–25లో 44,437 మంది విద్యార్థులు, 1,000 మంది ఉపాధ్యాయులను చేరుకుంది.

కేవలం ఒక సంవత్సరంలోనే, 66% మంది విద్యార్థులు తమ కెరీర్ నిర్ణయాలను స్వయంగా తీసుకోవడం ప్రారంభించారని నివేదికలు చెబుతున్నాయి. 99.7% మంది ఉపాధ్యాయులు 98.1% మంది విద్యార్థులు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగకరమని సానుకూల అభిప్రాయం వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా విస్తరించేందుకు ప్రణాళిక జరుగుతుంది. తద్వారా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా యువతకు ఉజ్వల భవిష్యత్తును అందించడంలో కీలక పాత్ర పోషిస్తుంది.

## ఉద్యోగ సృష్టికర్తలను సృష్టించే ఈఎండీపీ

తొమ్మిదో తరగతి విద్యార్థులకు ప్రత్యేకంగా రూపొందించిన వినూత్న కార్యక్రమం ఆంధ్రప్రదేశ్ ఎంటర్‌ప్రెన్యూర్ మైండ్‌సెట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (AP EMDP). యువతలో కేవలం ఉద్యోగం కోసం ఎదురుచూసే వారిగా కాకుండా, ఉద్యోగాలను సృష్టించే వ్యవస్థాపకులుగా తీర్చిదిద్దడానికి EMDP కార్యక్రమం









పూనుకుంది. ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయడంలో పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్ష ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. సమగ్ర శిక్ష ఈ కార్యక్రమానికి నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తుంది. ఈ రెండు విభాగాలు కలిసి పాఠశాల స్థాయిలో కార్యక్రమాన్ని రూపొందించి, అమలు చేసి, పర్యవేక్షిస్తాయి. సమస్య పరిష్కారం, ఆర్థిక అక్షరాస్యత, పట్టుదల వంటి నైపుణ్యాలను పెంపొందించడం దీని లక్ష్యం. AP EMDP కార్యక్రమం అంతర్జాతీయ స్థాయిలో కూడా గుర్తింపు పొందింది. ఇది MAIA Award, HundrED Youth Choice Award వంటి ప్రతిష్ఠాత్మక పురస్కారాలను గెలుచుకుంది. ఈ కార్యక్రమం దీర్ఘకాలిక ప్రభావంపై ప్రస్తుతం ప్రపంచ బ్యాంక్ సహకారంతో ఒక అధ్యయనం జరుగుతోంది. తద్వారా భవిష్యత్తులో ఆంధ్రప్రదేశ్ యువతలో వ్యవస్థాపక స్ఫూర్తి పెరిగి, రాష్ట్ర ఆర్థిక అభివృద్ధికి తోడ్పడగలదని ప్రభుత్వం ఆశిస్తోంది.

## ప్రభుత్వ పాఠశాలల్లో కోడింగ్ – అమెజాన్ ఫ్యూచర్ ఇంజినీర్

సాఫ్ట్‌వేర్ రంగంలో విజయం సాధించడానికి కోడింగ్ నైపుణ్యాలు ఎంత ముఖ్యమో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ముందుగానే గుర్తించింది. అమెజాన్ ఫ్యూచర్ ఇంజినీర్ (AEF) కార్యక్రమం ద్వారా క్వెస్ట్ అలయన్స్, సమగ్ర శిక్ష, లీడర్ షిప్ ఫర్ ఈక్విటీ (ఎల్ఎఫ్ఈ) భాగస్వామ్యంతో, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రంలోని 100 ప్రభుత్వ పాఠశాలల్లో 7, 8, 9 తరగతుల పిల్లల కోసం, ఉపాధ్యాయుల కోసం ఉపాధ్యాయులకు కోడింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (కృత్రిమ మేధస్సు – ఏఐ) పాఠ్యాంశాలను ప్రయోగాత్మకంగా ప్రారంభించింది. ఈ పైలట్ ప్రాజెక్టులో భాగంగా, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల్లోని 100 ప్రభుత్వ పాఠశాలల్లో, కేజీబీవీల్లో, ఏపీ మోడల్ స్కూళ్లలో దాదాపు 200 మంది ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వబడింది. ఈ శిక్షణ ద్వారా ఉపాధ్యాయులు సాంకేతిక పరిజ్ఞానం ఆధారిత బోధన పద్ధతులు, విద్యార్థుల కోసం కొత్త తరహా పాఠశాల వాతావరణం సృష్టించే విధానాలు అలవర్చుకున్నారు. ఈ ప్రోగ్రామ్ ద్వారా 23,000 మంది విద్యార్థులు మౌలిక AI భావనలు, భవిష్యత్ నైపుణ్యాలు, కెరీర్ సంబంధిత అవగాహన పొందగలిగారు.



ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా 248మంది ఉపాధ్యాయులు 7,381మంది విద్యార్థులకు కోడింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) ఆధారిత కోర్సులను నేర్పించారు. విద్యార్థులు కోడింగ్ ద్వారా గేమ్‌లు, యానిమేషన్లు రూపొందించి, నిజ జీవిత సమస్యలకు పరిష్కారాలను కనుగొనడం మొదలుపెట్టారు. ఈ కార్యక్రమం ఎంతగా విజయం సాధించిందంటే, ప్రతిభావంతులైన విద్యార్థుల కోసం 'హ్యాకథాన్' కూడా నిర్వహించారు. రాబోయే మూడేళ్లలో ప్రభుత్వ బడుల్లో 50,000 మంది విద్యార్థులకు, 500 మంది ఉపాధ్యాయులకు కోడింగ్ శిక్షణ అందించాలని లక్ష్యంగా పెట్టుకుంది ప్రభుత్వం.

అదేవిధంగా, క్వెస్ట్ ఏలియన్స్ ఆధ్వర్యంలో విశాఖపట్నంలోని గీతం విశ్వవిద్యాలయంలో జూన్ నెలలో "Hack to the Future Andhra – 2025" అనే నాలుగు రోజుల ప్రత్యేక కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు పాల్గొని భవిష్యత్ సాంకేతికతలకు అనుగుణంగా తమ సృజనాత్మక ఆలోచనలు, ఇన్నోవేటివ్ ప్రాజెక్ట్స్‌ను ప్రదర్శించారు.

మొత్తం 13 పాఠశాలల నుండి 13 ప్రోటోటైప్స్ రూపుదిద్దుకోగా, 39 మంది విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించారు. వీటిలో అత్యుత్తమ ప్రదర్శన చేసిన మూడు పాఠశాలల విద్యార్థులు (9 మంది) మరియు ముగ్గురు ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. వీరికి ప్రోత్సాహకరంగా ఈ నెల 22 నుండి 27 వరకు బెంగళూరులోని అమెజాన్ మేకర్ స్పేస్ కు క్వెస్ట్ ఏలియన్స్ NGO ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఎక్స్‌పోజర్ విజిట్ ఏర్పాటు చేశారు.

ఈ ప్రాజెక్ట్ ద్వారా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు, ముఖ్యంగా KGBVs, AP మోడల్ స్కూల్స్, ప్రభుత్వ హై స్కూల్స్ విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానంలో ముందుకు సాగేందుకు అవసరమైన శిక్షణ, మార్గదర్శనం పొందారు. ఇది వారికి భవిష్యత్తులో ఉన్నత స్థాయి విద్య, కెరీర్ అవకాశాలకు బలమైన పునాదిని ఏర్పరచుతుంది.

ఈ విద్యా సంవత్సరంలో ఈ ప్రోగ్రామ్ ను విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలో అన్ని సెకండరీ స్కూల్లో కొనసాగించడానికి LEAP యాప్ ద్వారా నామినేషన్ స్వీకరించారు దాదాపు 637 స్కూల్ వాలంటీర్ గా నామినేట్ చేసుకోవటం జరిగింది. ఈ విద్యా సంవత్సరంలో మూడు జిల్లాల్లో విస్తరించడానికి గల ఏర్పాట్లను క్వెస్ట్ ఏలియన్స్ NGO ప్రయత్నాలు ప్రారంభించింది.

## బాధ్యతాయుత పౌరులుగా తీర్చిదిద్దే 'దేశ్ అప్నయేన్ సహయోగ్ ఫౌండేషన్'

'దేశ్ అప్నయేన్ సహయోగ్ ఫౌండేషన్' ఒక లాభాపేక్ష లేని సంస్థ. 2015లో స్థాపించిన ఈ ఫౌండేషన్ దేశంలోని 14 రాష్ట్రాల్లో






ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల్లో కార్యక్రమాలను అమలు చేస్తోంది. ఈ ఫౌండేషన్ ద్వారా పాఠశాలలు, కళాశాలల విద్యార్థులను దేశభక్తి, క్రియాశీల, నాయకత్వ లక్షణాలు, బాధ్యతాయుత పౌరులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో పనిచేస్తోంది.

విద్యార్థులను "ACTiZENS" (Alert, Informed, and Active Citizens)గా మార్చడమే ఈ సంస్థ ముఖ్య ఉద్దేశ్యం. 2024–25లో ఆంధ్రప్రదేశ్‌లోని 2,000 పాఠశాలల్లో అమలు చేసిన ఈ కార్యక్రమం 78% విజయశాతం సాధించింది. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు పౌర జ్ఞానాన్ని పెంపొందించుకోవడమే కాకుండా, కమ్యూనిటీ ప్రాజెక్టుల్లో చురుకుగా పాల్గొంటున్నారు. ఇది విద్యార్థుల్లో సమస్యలను కలిసికట్టుగా పరిష్కరించాలనే సహకార ధోరణిని పెంపొందిస్తోంది.

ACTiZENS' Club Program ద్వారా విద్యార్థులు పౌర, సామాజిక అంశాలపై ప్రతి నెలా వివిధ రకాల కార్యకలాపాలలో పాల్గొంటారు. వీరి డిజిటల్ కంటెంట్ NEP 2020, NCERT సిలబస్‌లకు అనుగుణంగా ఉంటుంది. ఇది విద్యార్థులు పాఠ్యాంశాలను సులభంగా అర్థం చేసుకోవడానికి సహాయపడుతుంది. క్లబ్‌లో భాగమైన విద్యార్థులు అధికార పాత్రలను పోషించడం ద్వారా వారిలో నాయకత్వ నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి ప్రోత్సాహం లభిస్తుంది. ఉపాధ్యాయులు ఈ కార్యక్రమాలలో కీలక పాత్ర పోషిస్తారు. సంస్థ ఉపాధ్యాయులకు అవసరమైన వనరులు, మార్గదర్శకాలను అందిస్తుంది.




## ఇంగ్లీష్ భాష నైపుణ్యాలు పెంపునకు 'విభా – లీప్ ఫర్ వర్డ్'

ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల ఇంగ్లీష్ భాషా నైపుణ్యాలను మెరుగుపరచడానికి విభా, లీప్ ఫర్ వర్డ్ (LFW)తో కలిసి పనిచేస్తోంది. పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్ష, SCERT, విభా మరియు లీప్ ఫార్వర్డ్ భాగస్వామ్యంతో ప్రస్తుతం 7 జిల్లాల్లో (అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు డివిజన్‌లోని 11 మండలాల్లో, ఎన్టీఆర్ జిల్లాలోని 17 మండలాల్లో, కృష్ణా, గుంటూరు, నెల్లూరు, తిరుపతి, అన్నమయ్య) ఈ కార్యక్రమం అమలవుతోంది. 2వ తరగతి నుండి 5వ తరగతి విద్యార్థులకు పఠన, ఉచ్చారణ, సంభాషణ నైపుణ్యాలపై శిక్షణ ఇస్తోంది. 'స్పెల్ బి' తరహాలో మనదేశంలోని ప్రాంతీయ భాషా పాఠశాలల విద్యార్థులకు ప్రత్యేకంగా రూపొందించిన ఏకైక ఆంగ్లభాష పోటీ ఇది. ఇటీవల ముంబైలో జరిగిన అంతర్రాష్ట్ర వర్డ్ పవర్ ఛాంపియన్ షిప్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు జాతీయ ఛాంపియన్లుగా నిలిచారు. ఈ పోటీ గ్రామీణ విద్యార్థులకు సరైన ప్రోత్సాహం అందిస్తే వారు ఏ స్థాయిలోనైనా రాణించగలరని నిరూపించింది.

## పరిశుభ్రత అలవాట్లను పెంపొందించే.. డెట్టాల్ బనేగా స్వస్త్ ఇండియా

'డెట్టాల్ బనేగా స్వస్త్ ఇండియా' కార్యక్రమం అనేది రికట్ బెంకిజర్ (Reckitt Benckiser) అనే సంస్థ యొక్క కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (CSR) కార్యక్రమం. దేశవ్యాప్తంగా ప్రజల్లో పరిశుభ్రత, ఆరోగ్యం, పారిశుద్ధ్యంపై అవగాహన పెంచడం ఈ కార్యక్రమ లక్ష్యం. పాఠశాలల్లో పరిశుభ్రత విద్య (హైజీన్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్)లో భాగంగా, హ్యాండ్ వాష్ కార్యక్రమాలు, పాఠశాలల్లోని విద్యార్థులకు పరిశుభ్రత కిట్లను పంపిణీ చేస్తారు. ఈ కిట్లలో సబ్బులు, శానిటైజర్లు వంటి వస్తువులు ఉంటాయి. ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి ఆరోగ్యం, పరిశుభ్రత, పారిశుద్ధ్యంపై వర్క్‌షాప్‌లను నిర్వహిస్తారు. ఈ వర్క్‌షాప్‌లలో వ్యాధుల నివారణ, వ్యక్తిగత పరిశుభ్రత, సురక్షితమైన పారిశుద్ధ్య పద్ధతులపై అవగాహన కల్పిస్తారు. విద్యార్థులను 'హైజీన్ ఏజెంట్లు' గుర్తించి, చిన్న వయసు నుంచే పరిశుభ్రత అలవాట్లను పెంపొందించడం, తద్వారా వారు ఆరోగ్యంగా ఉండేలా చూడటం నేర్పిస్తారు. ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్ష ఈ కార్యక్రమాన్ని సమన్వయం చేస్తూ పాఠశాలల ద్వారా దీనిని విజయవంతంగా అమలు చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి.



## విద్యా వ్యవస్థలో సరికొత్త అధ్యాయం

"రాష్ట్రంలో విద్యారంగాన్ని, విద్యార్థుల భవిష్యత్తును మెరుగు పరచడానికి, వారిలో కొత్త నైపుణ్యాలు పెంపొందించడానికి ప్రభుత్వంతో స్వచ్ఛంద సంస్థలు కలిసి పని చేయడం సంతోషం. ఇలాంటి వినూత్న కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విద్యారంగంలో తెస్తున్న మార్పులకు అద్దం పడుతున్నాయి. ఈ కార్యక్రమాలు భవిష్యత్‌లో మరిన్ని పాఠశాలలకు, కళాశాలలకు విస్తరించాల్సి ఉంది. మన విద్యార్థులు ప్రపంచ స్థాయిలో పోటీపడగల సామర్థ్యాన్ని పొందుతారనడంలో ఈ స్వచ్ఛంద సంస్థల కృషే నిదర్శనం. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థల మధ్య ఇలాంటి భాగస్వామ్యాలు కొనసాగితే, విద్యా వ్యవస్థలో ఒక సరికొత్త అధ్యాయం మొదలవుతుంది."

– **బి. శ్రీనివాసరావు,** IAS.,
స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్, సమగ్ర శిక్ష

# మా
# కిచెన్ గార్డెన్
# కథ



పాఠశాలల్లో కిచెన్ గార్డెన్ (School Kitchen Garden) అనేది విద్యార్థులకు స్వయంగా నేర్చుకునే అనుభవాన్ని అందిస్తూ, పోషకాహారాన్ని అందించడానికి ఉద్దేశించిన ఒక అద్భుతమైన కార్యక్రమం. ముఖ్యంగా మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా, తాజా కూరగాయలను అందించడానికి ఈ కిచెన్ గార్డెన్ల ఏర్పాటును ప్రోత్సహిస్తోంది సమగ్రశిక్ష.

* మొక్కల పెరుగుదల, నేల తయారీ, విత్తనాలు నాటడం, కలుపు తీయడం, నీరు పెట్టడం, పంట కోత వంటి వ్యవసాయ పద్ధతుల గురించి విద్యార్థులు ఆచరణాత్మకంగా నేర్చుకుంటారు.
* విద్యార్థులలో జీవవైవిధ్యం, నీటి సంరక్షణ (డ్రిప్ ఇరిగేషన్), కంపోస్టింగ్ (సేంద్రీయ ఎరువు తయారీ) వంటి పర్యావరణ అనుకూల పద్ధతులపై అవగాహన పెరుగుతుంది.
* తోటపనిలో పాల్గొనడం ద్వారా బాధ్యత, సహనం, కృషి వంటి విలువైన జీవన నైపుణ్యాలు అలవడతాయి. సామాజిక పరస్పర చర్య, సహకారం మరియు జట్టుకృషి పెరుగుతాయి.
* తాము పండించిన ఆహారాన్ని తినడానికి పిల్లలు మరింత ఆసక్తి చూపుతారు, దీని వలన ఆకుకూరలు కూరగాయల పట్ల ఇష్టం పెరుగుతుంది.

ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రూరల్ మండలం వెంకటాపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయిని మనోజ నంబూరి సారథ్యంలో 'కిచెన్ గార్డెన్' ఎలా నిర్వహిస్తున్నారో చిన్నారుల మాటల్లో (వారి భావాలకు కాస్త సొబగులద్ది) తెలుసుకుందాం.



**1** పోయినేడు గోంగుర, వంకాయలు, ఎర్ర తోటకూర, దేశవాళీ తోటకూర, సొర, బీర, బెండ,అరటి పళ్ళు బాగా పండించాము. మా టీచరుగారు ఒకరోజు పనస తొనలు అందరికీ తెచ్చినపుడు మేం తిని మట్టిలో పాతిపెట్టాము. ఆశ్చర్యం...అయిదు మొక్కలు మొలిచాయి!. ఇపుడవి మాకంటే ఎత్తుపెరిగి ఆరడుగులయాయి. వచ్చే సంవత్సరం కాపుకాస్తాయని టీచర్ చెప్పారు.

– **కౌశిక్, కార్తీక్,** మూడవ తరగతి.

**2** మరి వేసవిలో బడి ఉండదు. ఎండకు, ఇంకా నీరులేకా మా మొక్కలు చనిపోతాయి కదా.. అందుకు మేం ఓ ప్రణాళిక వేసుకున్నాం. అయిదో తరగతి పిల్లలం రోజుకు ఇద్దరు చొప్పున బడితోటకు నీరు పెట్టుకోవాలని. మరి ఎవరైనా సెలవులకు ఊరు వెళితేనో... అపుడు మా స్కూల్ వాట్సాప్ గ్రూప్ లో ఆ విషయం చెప్పాలి. అపుడు టీచర్ మరొకరికి డ్యూటీ వేస్తారన్నమాట. అలా బ్రతికించుకున్న ఓ వంగ మొక్క రెండేళ్ళుగా ప్రతివారం కిలోన్నర వరకు వంకాయలనిస్తుంది. వాటిని సెలవుల్లో వంతులుగా మా ఇళ్ళకు తీసుకెళ్ళేవాళ్ళం. బడి ఉంటే మాత్రం మధ్యాహ్న భోజనంలోకి వాడుకుంటాం.

– **శ్రీకాంత్**. ఐదో తరగతి.

**3** బడి తెరిచాక మా టీచర్ ఒక తాతని పిలిచి గడ్డిని శుభ్రంగా చెక్కించారు. ట్రాక్టర్ తో దున్నించారు కూడ. అపుడు మేం వాన పడేవరకూ ఆగాం. ఎందుకంటే విత్తనాలు నాటాలంటే నేల ఒదులుగా ఉండాలి కదా. వానలు పడగానే మేం క్రితం పంటనుండి దాచిన గోంగూర, బీర, సొర, విత్తనాలను నేల చదును చేసి చల్లాం.

ఇంకా టీచర్, మేమూ నర్సరీకి వెళ్ళి జామ, బొప్పాయి, ఎర్ర, తెల్ల మందార, నందివర్ధనం వంటి మొక్కలు కొనుక్కొచ్చాం. మా బడి నేల గొప్పది. ఏం నాటినా మొలుస్తుంది. మాకు తోటపని చాలా ఇష్టం.. తోటపనికి చిన్నగా ఉండే, పదునులేని పనిముట్లు టీచర్ కొని తెచ్చారు. ఒకటో తరగతి వారు కూడా తోట పనంటే చాలా ఉత్సాహం





చూపుతారు. ఇందుకు గాను మా టీచర్ ఉదయం అరగంట ముందే వచ్చి సాయంత్రం గంట అదనంగా పాఠశాలలో ఉంటారు. ఇక మేమంతా కూడా టీచర్ తో పాటూ ఉండిపోయి తోట పని చూసుకొని ఇళ్ళకు వెళతాం.

– **ఉదయ, జ్యోతిక.** నాలుగో తరగతి

4 మీకో సంగతి తెలుసా.. మా అరటితోటలో ఎపుడూ అయిదు గెలలు కాస్తూ, పండుతూ ఉంటాయి.గెలలో ఒక కాయ పండేవరకూ వేచి చూసి, ఆయా సీతమ్మ సాయంతో కోస్తాం. గోనెసంచిలో కట్టి, అగరుబత్తి కొంచెం పొగ చూపిస్తే మూడు రోజుల్లో అరటిగెల సాంతం ఒకే రంగులో పండిపోతుంది. అపుడు మేమంతా మా మధ్యాహ్న భోజనంతో పాటు మేం పండించుకున్న అరటి పళ్ళను తింటాం. కాయగూరలైనా, అరటిపళ్ళైనా, పురుగు మందులు వాడకుండా, మా చేతులతో పండించి తింటుంటే ఎంత సంతోషంగా ఉంటుందో చెప్పలేం.

– **మణికంఠ సాయి.** ఐదో తరగతి.

5 మేం రెండు మోరింగా (మునగ) వేసాం. మా టీచర్ మునగ ఆకు పొడి తయారు చేసి, నెయ్యితొ వారంలో ఒకసారి వడ్డిస్తారు. రోగనిరోధక శక్తి కోసం మోరింగా ఎంతో మంచిదట..ముఖంపై మచ్చలు పోయాయి కూడా.

– **వసంత, దాక్షిత్**. రెండో తరగతి విద్యార్థులు

6 పోయినేడు తరల్ (TaRL) కార్యక్రమం చూసేందుకు నైజీరియాదేశం నుండి టీం వచ్చారు. మేమంతా తోటలోనుండి వంకాయలు, ఆకు కూరలు, బెండకాయలు, పూలను కోసి అప్పటికపుడే 'సంత 'ను ఏర్పాటు చేసి, నైజీరియన్ పరిశీలకుల అభినందనలు పొందాం. అరటిపళ్ళను వారికి బహుకరించాము. వారు మా తోటలో తమ గుర్తుగా విత్తనాలు నాటారు. అదొక మంచి సంఘటన.

– **యశ్వంత్ రాజు**, **పూజిత**. రెండో తరగతి.

7 మా అందరికీ ఇంట్లో కూడా మొక్కలు పెంచటం అలవాటైంది. ఫోన్లు చూడకుండా మొక్కలు పెంచటం, బొమ్మలు వేయటం, నో బ్యాగ్ డే లో నేర్చుకుంటున్న క్రాఫ్ట్స్ చేయడం చూసి మా పేరెంట్స్ ఎంతో ఆనందపడుతున్నారు. ఇక మేం ఈ అలవాటును పెద్దవాళ్లమైనా కొనసాగిస్తూ, ఈ పర్యావరణం వేడి తగ్గేందుకు, పొల్యూషన్ తగ్గించేందుకు మా వంతుగా మొక్కలు నాటి, శ్రద్ధగాపెంచుతాం.

– **తేజ** 4వ తరగతి, 2 వ తరగతి నుండి **శర్వణ్, కుమార్.**

(మనోజ నంబూరి, ప్రధానోపాధ్యాయిని, ప్రాథమిక పాఠశాల, వెంకటాపురం, విజయవాడ రూరల్ మండలం.)



# రన్ దీప్తీ రన్






"ఆమె దీప్తి" అన్నాడు ఎమ్మెస్కే ప్రసాద్. నమస్కారం పెట్టాలని కూడా ఆమెకు తెలియదు. చూపులు నిస్తేజంగా, ప్రవర్తన నిర్లిప్తంగా ఉండటంతో 'ఏమిటి అదోలా ఉంది' అని మాత్రం అనుకున్నాను. వారి సంభాషణలో, ఆపై ఆమె ప్రవర్తనతో, ఆ పాపది ఎ.యస్.డి (autism spectrum disorder) అని అర్థమైంది.

జన్యుపరమైన కారణాల వల్ల వచ్చే న్యూరోలాజికల్ డిజార్డర్ ఇది. మన దేశంలో ప్రతి వెయ్యి మందిలో ఏడుగురు దీని బారిన పడుతున్నారని అంచనా.

ఈ ఆటిజం ఉన్న పిల్లల ప్రవర్తన కాస్త డిఫరెంట్‌గా ఉంటుంది. ఈ పిల్లల మెదడు ఒకవైపు కొంత భాగం సరిగ్గా పని చేయదు. మామూలు పిల్లలతో పోలిస్తే వాళ్లు కొన్ని విషయాల్లో వెనకబడి పోతారు. ఆ క్రమంలో అనేక సవాళ్లను, అవహేళనలనూ, చిన్న చూపునూ ఎదుర్కోవాల్సి వస్తుంది. ఈ ఆటిజం లక్షణాలు సాధారణంగా ఒకటి రెండేళ్ల వయసు నుంచే కనిపిస్తాయి.




* పాకుతున్న వయసులో పేరుతో పిలిచినా గుర్తించక పోవటం.
* కాస్త పెద్దయ్యాక సంతోషం, విచారం, కోపం, ఆశ్చర్యం లాంటివి ప్రదర్శించక పోవడం.
* వేరే ఏదో లోకంలో ఉన్నట్టు, మిగతా పిల్లలతో కలవకపోవటం.
* చెప్పిందే చెప్పటం. చేసిన పనులే చెయ్యటం.
* అందరిలా స్పీడుగా కాకుండా తడువుకుంటూ మాట్లాడటం.
* ఎదుటివారి కళ్లలోకి చూడకుండా మాట్లాడటం. చూపులు నిస్తేజంగా, అభావంగా ఉండటం.
* ఇతరులని అర్థం చేసుకునే ఉద్దేశ్యం లేని నిరాసక్తత.
* దినచర్యలో మార్పులకూ, లేదా పరిసరాల్లో మార్పు వచ్చినా దానికి ఇమడలేక పోవటం.


## వర్చువల్ ఆటిజం:

ఇటీవలి కాలంలో ఆటిజం కన్నా ప్రమాదకరమైన ఒక వ్యాధి పిల్లల్లో పెరుగుతోంది. దాన్ని వర్చువల్ ఆటిజం అంటారు. తల్లిదండ్రుల నుంచి వచ్చే జన్యుపరమైన ఆటిజంకి పిల్లలు ఏమి చేయలేరు. అది వారి చేతుల్లో లేదు. కానీ వర్చువల్ ఆటిజం పిల్లలు / పెద్దలు చేజేతులారా చేసుకున్నది.

స్మార్ట్ ఫోన్, టీవీ ఎక్కువ సేపు చూడటం ద్వారా పిల్లల్లో ఇటీవలి కాలంలో పెరుగుతున్న ఈ కొత్త వ్యాధి గురించి ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో డాక్టర్లు చాలా భయంకరమైన వాస్తవాలు చెబుతున్నారు.

ఒకప్పుడు నెలకి ఒకటి రెండు కేసులు వస్తే, ప్రస్తుతం 8 నుంచి 10 వరకూ వస్తున్నాయని కాచిగూడలోని పీడియాట్రిక్ న్యూరాలజిస్ట్ డాక్టర్ లోకేష్ లింగప్ప చెప్పారు. బీహార్ నుంచి ట్రాన్స్‌ఫరై






వచ్చిన దంపతులు తమ కొడుకుని సైకలాజిక ట్రీట్మెంట్ కోసం తీసుకువచ్చారని చెప్తూ, తల్లిదండ్రులు ఇద్దరు కంప్యూటర్ కంపెనీలో పని చేస్తూ ఉండటంతో, నాయనమ్మతో ఇంట్లో ఒంటరిగా ఉండే ఆ పిల్లవాడు, స్కూల్ అయిపోయిన తరువాత ఈ ఫోన్ అలవాటు పడ్డాడని, కొంతకాలానికి ఈ వర్చువల్ ఆర్టిజానికి లోనయ్యాడని వివరించారు.

వారానికి ఎనిమిది గంటల కన్నా ఎక్కువ సమయాన్ని స్క్రీన్ చూసే పిల్లలు ఈ రోగానికి లోనవుతారు. తల్లిదండులలో ఒకరికి (లేదా ఇద్దరికీ) కోవిడ్ వచ్చిన తర్వాత పుట్టిన పిల్లలకీ, పెరుగుతున్న వయసులో కోవిడ్ వచ్చిన పిల్లలకీ ఇది సులభంగా సంక్రమిస్తుందని వారు వివరించారు.

ప్రపంచంతో పూర్తిగా సంబంధం కోల్పోయి, కేవలం యూ-ట్యూబ్ మీద ఆధారపడటం వల్ల పిల్లల్లో ప్రతిస్పందనలు పూర్తిగా తగ్గిపోతున్నాయి అంటున్నారు సైకాలజిస్టులు. హుషారుగా ఉండక పోవటం, ఎప్పుడూ డల్‌గా, ఏదో ఆలోచిస్తూ ఉడటం, 'భోజనం చేశావా' లాంటి చిన్న ప్రశ్నకి కూడా అడిగిన వెంటనే సమాధానం చెప్ప(లే)కపోవటం, ఏదన్నా పని చేయమని చెపితే, దాన్ని అర్థం చేసుకోవడానికి కొంత టైమ్ తీసుకోవటం వీరి లక్షణాలు.

ఏదైనా చెప్తే, గతంలో కనీసం నాలుగు నిమిషాలు శ్రద్ధగా వినేవారనీ, ఇప్పుడా ఏకాగ్రత రెండు నిమిషాలకు తగ్గిపోయిందనీ వెల్లడించారు. ఏదైనా పని చెప్తే, అర్థం చేసుకోవడానికి సాధారణంగా పిల్లలకి గతంలో 5.10 సెకండ్స్ పట్టేదనీ, ఇప్పుడది సగటున 8.3 సెకండ్లకి పెరిగిందనీ అంటున్నారు. అంతే కాకుండా ఒక పని వందశాతం సంపూర్ణంగా చేయటానికి కావలసిన ఏకాగ్రత 1.00 నుంచీ 0.75కి తగ్గిందనీ, ఒకేసారి రెండు మూడు పనులు చేసే సామర్థ్యం పూర్తిగా తగ్గి పోయిందని ఇటీవలి రీసెర్చ్ తెలుపుతోంది.

ఇంట్లో పెద్దలు, స్కూల్లో టీచర్లు దీని గురించి విస్తృతంగా ప్రాచుర్యం కల్పించి, విద్యార్థులకి అర్థమయ్యేలా చెప్పాలి.

**ఇటీవల కాలంలో నేను ఒక అద్భుతమైన కొటేషన్ చదివాను.**

"Difference means it is NOT less". సాధారణ పిల్లలకూ, ఆటిజం ఉన్నవారికి తేడా ఉంటుంది. అయితే 'తేడా' అంటే... వాళ్ళు మనకన్నా తక్కువ- అని కాదు. కొన్ని విషయాల్లో మనకన్నా చాలా ఎక్కువ శక్తివంతంగా ఉంటారు" అని.

నిజమే. ఆటిజం ఉన్న పిల్లల్లో తప్పకుండా ఏదో ఒక ప్రత్యేకమైన టాలెంట్ ఉంటుంది. దాన్ని వెలికి తీస్తే వాళ్లు అద్భుతంగా రాణిస్తారు.

ముంబయికి చెందిన రెండేళ్ల పాప జియా, తన బొమ్మలతో ఆడుకునే విధానం కాస్త తేడాగా అనిపించి తల్లిదండ్రులు డాక్టర్ దగ్గరకు తీసుకు వెళ్తే వాళ్లు 'జియా'కు ఆటిజం అని తేల్చారు. దాంతో వారు చాలా బాధ పడ్డారు. కానీ క్రుంగిపోలేదు. రెగ్యులర్‌గా థెరపీలు చేయించారు. పాపలోని స్కిల్స్ గుర్తించి ప్రోత్సహించారు. జియాకి నీళ్ళు, ఈత అంటే చాలా ఇష్టం. బిడ్డ కోసం తల్లి తను చేస్తున్న ఉద్యోగాన్ని వదిలేసి స్విమ్మింగ్ నేర్చుకుంది. పదహారేళ్ల జియా తన లోపాన్ని జయించింది. పోయిన ఏడాది ఇంగ్లీష్ చానల్ ఈది ప్రపంచ రికార్డు నెలకొల్పింది.

అండగా ఉంటే ఆటిజం పిల్లలు ఏదైనా సాధిస్తారనడానికి ఇదే నిదర్శనం. ఆ విషయమే వివరిస్తూ ఎమ్మెస్కే ప్రసాద్ ఆ అమ్మాయి గురించీ, ఆమె సాధించిన ఒలంపిక్స్ మెడల్స్ గురించీ నాకు చెపుతున్నాడు. దిగ్భ్రాంతుడనై చూశాను.

అది జీవితమా, లేక సినిమా కథా అనిపించింది. ఆ అమ్మాయి రికార్డులు వింటూ ఉంటే "భాగ్ మిల్కా భాగ్" జ్ఞాపకం వచ్చింది. అందుకే ఈ పుస్తకానికి కూడా అదే పేరు పెట్టాలని తక్షణ నిర్ణయం తీసుకున్నాను. "రన్ దీప్తి రన్".

**– యండమూరి వీరేంద్రనాథ్**
9246502662

# కొలువు సాధించిన గురువులు

**పేదరికం, కుటుంబ బాధ్యతలు, పగలంతా శ్రమించినా... ఉపాధ్యాయ వృత్తిని సాధించాలనే సంకల్పం వీరిని నిలబెట్టింది. ఎన్నో ఏళ్ల నిరీక్షణ తర్వాత వచ్చిన మెగా డీఎస్సీ అవకాశాన్ని పట్టుదలతో ఒడిసిపట్టి, వేలాది మంది అభ్యర్థులను అధిగమించి ప్రభుత్వ కొలువులు దక్కించుకున్నారు.**

**ఒకే ఊళ్లో ఎక్కువమంది ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించి ఊరు పేరు మోగించే ఘటనలు, కొన్ని చోట్ల తండ్రీకొడుకు, అక్కా చెల్లెళ్లు, భార్యాభర్తలు, అన్నదమ్ములు... ఇలా కుటుంబ సభ్యులు ఒకేసారి ఉద్యోగం సాధించి కొలువులు జాతర చేసుకున్న సంగతులు... ఇంకొందరి కలల పయనాలు, మరికొంతమంది విభిన్న వృత్తుల నుంచి వచ్చి, నిరుపేద నేపథ్యాల కష్టజీవుల విజయరేఖలు.. ఇవన్నీ కలిపితే ఈ కథనం.. చదివేద్దామా మరి.**

## ఊరు పేరు మారుమోగేలా...

### ఆ ఊరు నుంచి పది మంది టీచర్లు

* విజయనగరం జిల్లా మెంటాడ మండలం పెదమేడపల్లి గ్రామం నుంచి ఏకంగా పదిమంది మెగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయులుగా నియామకం అయ్యారు. వీరిలో ఆర్.కృష్ణ (పీఈటీ), బి.గోపి (ఎస్ఏ సోషల్), ఇ.సత్య నారాయణ (ఎస్జీటీ), ఆర్.చంటి (ఎస్జీటీ), బి.బంగార్రాజు (ఎస్ఏ మ్యాథ్స్), కె.నాగరాజు (ఎస్ఏ సోషల్), కె.గౌరిమణి (టీజీటీ మ్యాథ్స్), వి. లావణ్య (ఎస్జీటీ), వి.షర్మిల (ఎస్జీటీ), బి.కల్యాణి (ఎస్ఏపీఎస్) ఉన్నారు. ఒకే గ్రామం నుంచి పదిమంది ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికవడం మండల చరిత్రలో ఇదే ప్రథమంగా చెబుతున్నారు.





ప్రస్తుతం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కోరుకొండ మండలం శ్రీరంగపట్నం పేరు అలాగే మారుమ్రోగిపోతోంది. శ్రీరంగపట్నం కళలకు పుట్టిల్లు. ఇక్కడ ప్రతి ఇంట్లోను ఒక కళాకారుడు ఉంటాడు. అలాంటి గ్రామం నుంచి ఓ అరుదైన రికార్డు. ఇటీవల జరిగిన మెగా డీఎస్సీలో ఈ గ్రామం నుంచి 10 మంది ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. ప్రభుత్వ పాఠశాలలో చదివినా పట్టుదలతో చదివి మాస్టార్లుగా మారిపోయారు. వీరిలో నలుగురు మహిళలు, ఆరుగురు పురుషులు ఉన్నారు. ఇప్పటికే ఈ గ్రామం నుంచి సుమారు 15 మంది ఉపాధ్యాయులుగా ఉన్నారు. అంటే మొత్తం ఆ గ్రామంలో 25 మంది ఉపాధ్యాయులు ఉన్నట్లన్నమాట.

### పాదిరికుప్పంలో ఏడుగురు అయ్యోర్లయ్యారు

* చిత్తూరు జిల్లా కార్వేటినగరం మండలం పాదిరి కుప్పం గ్రామం నుండి ఏడుగురు టీచర్లుగా ఎంపికయ్యారు. పి.తిరుమలేశం స్కూల్ అసిస్టెంటు (మేథ్స్), ఎస్జీటీగా కూడా ఎంపికయ్యారు. ఎ.గీత స్కూల్ అసిస్టెంటు (సోషియల్), ఎం.శిరీష ఎస్జీటీగా, కె.భాగ్యశ్రీ ఎస్జీటీగా, ఎ.స్వాతి ఎస్జీటీగా, రోజా ఎస్జీటీగా, నవీన్ ఎస్జీటీగా ఎంపికయ్యారు.

### పది మందికి ఆదర్శంగా...

* పల్లెటూరులో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం వస్తేనే గొప్ప. అటువంటిది ఒకే ఊరులో ఏకంగా పది మంది ఒకే తరహా ఉద్యోగం సాధిస్తే ఎలా ఉంటుంది...!? ఆశ్చర్యమే కదూ... అది కూడా అన్నీ మంచి ర్యాంకులే అయితే ఆ ఊరు పేరు మారుమ్రోగి పోతోంది.



### లక్కవరం.. ఇది టీచర్ల ఊరు

* డీఎస్సీ ఫలితాల్లో ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలం లక్కవరం గ్రామం ప్రత్యేకంగా నిలిచింది. సుమారు ఎనిమిది వేల మంది జనాభా ఉన్న ఈ గ్రామం నుంచి తాజా ఫలితాల్లో 9 మంది ర్యాంకులు సాధించారు. ఇందులో ఎస్ఏ తెలుగులో ఉమ్మడి జిల్లాలో ప్రథమ ర్యాంకు, 4వ ర్యాంకు, 17వ ర్యాంకు 49వ ర్యాంకులతో పాటు ఎస్ఏ హిందీలో 17 ర్యాంకులు వచ్చిన వారు ఉన్నారు. గతంలోనూ వివిధ డీఎస్సీల్లో ఇదే ఊరి నుంచి 20 మందికి పైగా ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు.



# కుటుంబాల్లో కొలువుల జాతర

### తెనగల్లు.. టీచర్లకు పుట్టినిల్లు..!

* తెనగల్లు.. ఉపాధ్యాయ పోస్టులకయితే అది పుట్టినిల్లు. అనంతపురం జిల్లా కుందుర్పి మండలం లోని గల ఈ గ్రామానికి చెందిన నిరుద్యోగులు డీఎస్సీ ఫలితాల్లో సత్తా చాటి, 9 మంది ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికయ్యారు. దీంతో ఆ గ్రామంలో టీచర్ పోస్టులకు ఎంపికయిన వారు 40 మంది దాకా ఉన్నారు. అందరూ మధ్య తరగతి, వ్యవసాయ కూలీలు, పేద కుటుంబా లకు చెందిన వారే.



### విజయనగరం జిల్లా కెంగువలో ఆరుగురికి ...

* విజయనగరం జిల్లా కెంగువ గ్రామంలో ఆరుగురు అభ్యర్థులు ఉపాధ్యాయ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. గ్రామానికి చెందిన మజ్జి భార్గవి, మిత్తిరెడ్డి అప్పలనాయుడు, బండారు ఈశ్వరరావు, లోగిస కృష్ణవేణి, గుడివాడ సత్యారావు, మజ్జి సౌభాగ్యలక్ష్మి డీఎస్సీలో వివిధ పోస్టులకు ఎంపికయ్యారు.




### శేషపుపేటలో నలుగురికి అవకాశం

* విజయనగరం జిల్లా గుర్ల మండలంలో శేషపుపేటకు చెందిన నలుగురు డీఎస్సీలో సత్తా చాటారు. చందక సరస్వతి ఎస్జీటీలో 87.15 మార్కులతో 70వ ర్యాంకు, కంది సత్యనారాయణ ఎస్జీటీ లో 88.26 మార్కులతో 47వ ర్యాంకు సాధించారు. సంగారెడ్డి సత్యం స్కూల్ అసిస్టెంట్ బయాలజీలో 81.44 మార్కులతో 7వ ర్యాంకు, చందక లక్ష్మణరావు పీఈటీగా 82 మార్కులతో 17వ ర్యాంకు సాధించారు.

### తండ్రీకొడుకు ఒకే పాఠశాలలో, ఒకే సబ్జెక్టు:



* విజయనగరం జిల్లా బొబ్బిలిలో, తండ్రి రామకృష్ణ పనిచేస్తున్న గొల్లపల్లి వేణుగోపాలస్వామి మున్సిపల్ హైస్కూలులోనే కొడుకు బంకురు రాకేష్ కూడా ఇంగ్లీషు స్కూల్ అసిస్టెంట్‌గా ఎంపిక కావడం అరుదైన విషయం.

### తిరుపతి జిల్లాలో మరో తండ్రీకొడుకు:



* చంద్రగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తండ్రి మునగల రవీంద్రుడు తెలుగు భాషా ఉపాధ్యాయుడిగా పనిచేస్తుండగా, ఆయన కుమారుడు హరిప్రసాద్ కూడా ఇటీవల డీఎస్సీ ద్వారా ఫిజికల్ సైన్స్ టీచర్‌గా ఉద్యోగం సాధించారు. వీరి స్వస్థలం తిరుపతి రూరల్ ఓటేరు శ్రీవారి నగర్.

### ఒకే పాఠశాలలో అక్కాచెల్లెళ్లు:

* అన్నమయ్య జిల్లా, ములకలచెరువు మండలం బత్తాలపురానికి చెందిన అక్కాచెల్లెళ్లు జల్లా శ్రీలత, జల్లా హేమలతలు ప్రతిభ కనబరిచి డీఎస్సీలో ఎంపికయ్యారు. కౌన్సెలింగ్‌లో మదనపల్లె హోప్ మున్సిపల్ ఉన్నత పాఠశాలనే ఎంచుకుని స్కూల్ అసిస్టెంటులుగా విధుల్లో చేరారు.

### ఒకే ఇంట్లో ముగ్గురు ఉపాధ్యాయులు

* కడపలోని పెండ్లిమర్రి మండలం గంగనపల్లె గ్రామానికి చెందిన సయ్యద్ సనావుల్లా (ఉర్దూ ఎస్ఏ ఫిజిక్స్‌లో జిల్లా మొదటి ర్యాంకు), ఆయన భార్య నజీహకరీం (ఎస్జీటీ ఉర్దూలో జిల్లా ఫస్ట్ ర్యాంకు), సనావుల్లా చెల్లెలు రేష్మా (ఉర్దూ ఎస్జీటీ ఈడబ్ల్యూఎస్ విభాగంలో 20వ ర్యాంకు) ఒకేసారి ఉద్యోగాలు సాధించారు. పేద కుటుంబం నుంచి వచ్చి, అహర్నిశలు చదివి ఈ విజయాన్ని సొంతం చేసుకున్నారు.

### భార్యాభర్తలకు ఒకేసారి డీఎస్సీ:

గుంటూరు జిల్లా పిడుగురాళ్ల మండలం తుమ్మలచెరువు గ్రామానికి చెందిన నాగిరెడ్డి, ఉదయశ్రీ దంపతులు ఈ ఏడాది డీఎస్సీ పరీక్షలు రాశారు. వెలువడిన ఫలితాలలో ఇద్దరూ ఉద్యోగాలు సాధించారు. నాగిరెడ్డి పదో తరగతి తర్వాత ఇంటర్, డిగ్రీ దూర విద్యలో పూర్తి చేశారు. అంతటితో ఆగకుండా బీఈడీ కూడా చదివారు. సచివాలయ ఉద్యోగాలకు పరీక్ష రాసి ఉద్యోగం సాధించారు. అయినా అంతటితో ఆగలేదు. డీఎస్సీకి ప్రిపేర్ అవుతూనే ఉన్నారు. తనతోపాటు భార్యను కూడా విద్య వైపు నడిపించి డిగ్రీ, బీఈడీ పూర్తి చేయించారు. ఇద్దరు ఇటీవల డీఎస్సీ పరీక్షలు రాశారు. స్కూల్ అసిస్టెంటుగా సోషల్లో 73.72 మార్కులతో నాగిరెడ్డి జిల్లా స్థాయిలో



67వ ర్యాంకు, ఉదయశ్రీ కూడా 74.55 మార్కులతో జిల్లా స్థాయి 50వ ర్యాంక్ సాధించారు.

* కడప జిల్లా పోరుమామిళ్లకు చెందిన భార్యాభర్తలు కారు తేజస్విని ఎస్జీటీ పోస్టుకు, ఆమె భర్త అంబవరం శేఖర్ ప్రిన్సిపాల్ పోస్టుకుచ అర్హత సాధించారు.



* కాశినాయన మండలంలో ఉప్పలూరు గ్రామానికి చెందిన పాలకొలను సుబ్బారెడ్డి ఫిజిక్స్ లో 77.79 మార్కులతో జిల్లా మూడో ర్యాంకు సాధించారు. ఆయన భార్య పనిపెంట శ్రీలత ఫిజిక్స్ లో 13 ర్యాంకు సాధించారు. సుబ్బారెడ్డి ప్రైవేటు స్కూళ్లో, శ్రీలత కేజీబీవీలో టీచర్లుగా పని చేస్తున్నారు.



* చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మండలం టేకుమందకు చెందిన జనార్దన్, నిరుపమ దంపతులు ఇద్దరూ డీఎస్సీలో ఎంపికయ్యారు. జనార్దన్ ఎస్జీటీలో 85వ స్థానంలో, నిరుపమ ఎస్ఏ ఇంగ్లిష్‌లో 44వ స్థానంలో నిలిచారు.

## డీఎస్సీలో అక్కాచెల్లెళ్లు, అన్నాదమ్ములు:

* శ్రీసత్యసాయి జిల్లాకు హిందూపురం పట్టణంలో లక్ష్మీపురం కాలనీకి చెందిన విజయలక్ష్మి (ఎస్ఏ హిందీలో జిల్లా ఫస్ట్ ర్యాంక్) సాధించగా, ఆమె తమ్ముడు శ్యామసుందర్ నాయక్ (ఎస్జీటీ ఇంగ్లిష్‌లో జిల్లా నాలుగో ర్యాంక్) లు దక్కించుకున్నారు. తల్లిదండ్రులు మాంసం దుకాణం నడుపుతున్నారు.



*నంద్యాల జిల్లా నందికొట్కూరు మండలం అల్లూరు గ్రామంలో ఒకే కుటుంబం నుండి అక్కా చెల్లెళ్లు డీఎస్సీలో సత్తా చాటారు. తండ్రి నాగరాజు ఆర్టీసీ డ్రైవర్. తల్లి నాగమణి దంపతుల ఇద్దరు కుమార్తెలు డీఎస్సీ ఫలితాల్లో రాణించారు. పెద్ద కుమార్తె రేచెల ఎస్జీటీగా, చిన్నకుమార్తె హరిత స్కూల్ అసిస్టెంట్(గణితం)గా ఉద్యోగాలు సాధించారు.



* కర్నూలు జిల్లాకు పత్తికొండ మండలం హోసూరు గ్రామానికి చెందిన నాగరాజు (ఎస్ఏ బయాలజీలో జిల్లా ఫస్ట్ ర్యాంక్), సంపత్ కుమార్ (టీజీటీ తెలుగులో ఐదో ర్యాంకు) అన్నదమ్ములు. నలుగురు అన్నదమ్ములు కాగా మొదటి ఇద్దరు కూలీ పనులు చేస్తూ, ఆటో నడుపుతూ వీళ్లను చదివించారు. అన్నయ్యల ఆశయాలను నిజం చేశారీ తమ్ముళ్లు.



* కడప జిల్లా పోరుమామిళ్లలోనే మహబూబ్ నగర్ కాలనీలో ఖాదర్ భాష కుమార్తెలు మెహతాజ్, రేష్మ మెగా డీఎస్సీలో టీచర్లుగా అవకాశం దక్కించుకున్నారు. వీరి తండ్రి కూడా ఉపాధ్యాయుడే.



* నెల్లూరు జిల్లా ఉదయ గిరిలోని దిలావర్ బాయ్ వీధికి చెందిన అన్నదమ్ములైన షేక్ నస్రుల్లా ఎస్ఏ ఇంగ్లీష్ సబ్జెక్టులో 57వ ర్యాంకు, షేక్ సిగ్బతుల్లా పీఈటీ బీసీ – ఈ విభాగంలో 1వ ర్యాంకు, జనరల్ కేటగిరీలో 179వ ర్యాంకులు సాధించి కొలువు కొట్టారు.



### ఆ ఇంట్లో అందరూ టీచర్లే

* పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంకు చెందిన వి. వేణుమాధురి రెండు ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికయ్యారు. స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీ ఉద్యోగాలు సాధించారు. తండ్రి మోహనరావు స్కూల్ అసిస్టెంట్, తల్లి శ్రీలక్ష్మి ప్రైమరీ స్కూల్ హెచ్ఎం, అక్క అనుచందన మున్సిపల్ స్కూల్ టీచర్. ఒకే కుటుంబంలో నలుగురు ఉపా ధ్యాయులు ఉండటం ప్రత్యేకత.



### ఆత్మకూరులో.. అన్నదమ్ములు

* షేక్ అజహరుల్లా, అతహరుల్లా ఇద్దరు సోదరులు ఎస్జీటీలో 5, 17వ ర్యాంకులు సాధించి ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికయ్యారు. నంద్యాల జిల్లా ఆత్మకూరు మండలం ఉలవదిబ్బకు చెందిన షేక్ అజహరుల్లా, అతహరుల్లా ఇద్దరు సోదరులు. తండ్రి షేక్ జిలానీ, ప్రభుత్వ ఉపాధ్యాయుడు. కష్టపడి చదివి తండ్రిలాగే ఉపాధ్యాయులు కావాలని కలలు కన్నారు. ఆ మేరకు కష్టపడి డిగ్రీ, బీఈడీ చేశారు. శిక్షణ పొంది డీఎస్సీ రాశారు.



## కలల పయనాలు..

### పదో తరగతిలో పెళ్లి... ఇప్పుడు జిల్లా టాపర్!

* కడప జిల్లా డీఎస్సీ టాపర్ గా నిలిచిన శివ స్వప్న.. కుటుంబ పరిస్థితుల కారణంగా పదో తరగతిలోనే చదువుకు బ్రేక్ పడినా, ఆమె తన కలని వదులుకోలేదు. భర్త సహకారంతో చదివి విజయం సాధించారు. మేనత్త కోరిక మేరకు పదో తరగతిలోనే ఆమెకు బావ శ్రీనివాస్ రెడ్డితో పెళ్లి జరిగింది.



భర్త ఉద్యోగం కారణంగా తమిళనాడుకు వెళ్లాల్సి వచ్చింది. చదువుకోవాలనే తన మనసులోని మాటను భర్తకు చెప్పగా, ఆయన అందుకు అంగీకరించి ఆమెను తల్లిదండ్రుల ఊరు ప్రొద్దుటూరుకు పంపించారు. అక్కడే తల్లి ఆదెమ్మ, అక్క పార్వతి సాయంతో పాపను చూసుకుంటూనే డిగ్రీ, బీఈడీ పూర్తి చేశారు. ఇగ్నో దూరవిద్య ద్వారా ఎం.ఏ. ఇంగ్లిష్ చదివారు. డీఎస్సీ నోటిఫికేషన్ పడగానే ప్రొద్దుటూరు వచ్చి, సొంతంగా సిద్ధమవుతూ మాక్ టెస్టులు రాశారు. ఆమె కృషికి ఫలితంగా వైఎస్సార్ కడప జిల్లాలో స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లిష్ లాంగ్వేజ్) జిల్లా టాపర్‌గా (83.27 మార్కులు) నిలిచారు.

### మా నాన్న కల నెరవేర్చాం

* కృష్ణా జిల్లా గుడివాడకు చెందిన గ్యాస్ స్టవ్ రిపేర్లు చేసే లింగాల రాంబాబు కుమార్తె నాగసాయిలక్ష్మి ఎస్జీటీ విభాగంలో 4వ ర్యాంకు, కొడుకు శబరినాథ్ 18వ ర్యాంకు సాధించారు. అలాగే, రేపల్లెకు చెందిన కొక్కిలిగడ్డ సుధారాణి, పావనిలు బీమా కంపెనీ ఏజెంట్ అయిన తమ తండ్రిని ఉపాధ్యాయులుగా చూడాలనే కలను నెరవేర్చడానికి నిరంతర శ్రమతో విజయం సాధించారు.



### భార్య కోరిక నెరవేర్చిన భర్త

* ఎన్టీఆర్ జిల్లా, రెడ్డిగూడెం మండలం, రెడ్డికుంటకు చెందిన ఆరేపల్లి రామకృష్ణ.. జీవితంలో ఎదురైన కష్టం ఎవరికీ రాకూడదు. ఎంతో ప్రేమగా పెళ్లి చేసుకున్న ఆయన భార్య, వెంకటరమణ.. ఏడాది క్రితం డెంగీతో మరణించారు. భార్య మరణంతో ఇద్దరు పిల్లల ఆలనా పాలనా చూసుకోవాల్సిన బాధ్యత, చిరుద్యోగం భారం ఆయనకు కష్టంగా మారింది. ఈ ఇబ్బందుల మధ్యనే, తనను ఉపాధ్యాయుడిగా చూడాలన్న అర్ధాంగి కోరికను తీర్చాలని ఆయన గట్టి సంకల్పం చేసుకున్నారు. పట్టుదలతో రోజుకు 17 గంటలు కష్టపడి చదివి, 70.02 మార్కులతో స్కూల్ అసిస్టెంట్ (బయాలజీ)గా ఎంపికయ్యారు. ''నా భార్య కోరికను నెరవేర్చడం సంతోషాన్ని కలిగిస్తోంది. ఆమె బతికి ఉంటే ఎంతో సంబరపడేది'' అని ఆయన చెప్పుకొచ్చారు.



### పేదరికం అడ్డుకోలేకపోయింది

* చిత్తూరు జిల్లాకు చెందిన వాణి, శిరీష అక్కాచెల్లెళ్లు. తండ్రి చిన్నప్పుడే చనిపోవడంతో, తల్లి పడిన కష్టం వృథా కాకుండా ఉండాలనే పట్టుదలతో చదివారు. ఇప్పటికే వారి అక్కాచెల్లెళ్లు వీణా కుమారి, వనజాక్షి పోలీస్ కానిస్టేబుళ్లుగా ఉద్యోగాలు సాధించగా, వీరు కూడా సెకండరీ గ్రేడ్ టీచర్లుగా ఉద్యోగాలు సాధించారు.



## కష్టజీవుల విజయరేఖలు

### మెకానిక్ నుండి మేస్టారు వరకు:

* అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం గొడిచర్ల గ్రామానికి చెందిన కర్రి నాగేశ్వరరావు మోటారు సైకిళ్లకు సీట్లు కుట్టే షాపు నడుపుతూనే బీఈడీ పూర్తి చేశారు. కష్టపడి చదివి సోషల్ స్టడీస్‌లో 3వ ర్యాంకు సాధించి స్కూల్ అసిస్టెంట్‌గా ఎంపికయ్యారు. తునిలో బైక్ సీటు కవర్ల తయారీ షాపు పెట్టుకుని పనిచేసుకుంటూనే శ్రమించి ఉత్తమ ర్యాంకు సాధించడం విశేషం.

### రోజువారీ కూలీ నుండి ఉపాధ్యాయుడిగా:



* డా. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు చెందిన చాట్ల రత్నరాజు ఏడేళ్లుగా పెయింటింగ్, కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించారు. ఎన్ని కష్టాలు వచ్చినా చదువును విస్మరించకుండా మెగా డీఎస్సీలో 75వ ర్యాంకు సాధించి స్కూల్ అసిస్టెంట్ (సోషల్) పోస్టును కైవసం చేసుకున్నారు.

### తోపుడుబండి వ్యాపారి కూతురికి రెండు కొలువులు:

* అనంతపురం నగరానికి చెందిన తోపుడుబండి వ్యాపారుల కూతురు పార్వతి తోపుడుబండి వ్యాపారం చేస్తూ చదివి, ఇటీవల విడుదలైన పోలీస్ కానిస్టేబుల్ ఫలితాలలో ఉద్యోగానికి ఎంపికయింది. అంతేకాకుండా, డీఎస్సీ ఫలితాల్లో ఎస్జీటీ పోస్టుకు ఎంపికైంది. ఈ రెండింటిలో ఎస్జీటీగా వెళ్లాలని నిర్ణయించుకుంది.



### చిన్నతనంలో అమ్మానాన్నలను కోల్పోయి..

* అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం దోసలపాడుకు చెందిన భవిరిశెట్టి రామకృష్ణ చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయారు. అన్నయ్య, అమ్మమ్మ, నాన్నమ్మల వద్ద ఉంటూ ఉన్నత చదువులు చదివి సోషల్ స్టడీస్‌లో జిల్లా 2వ ర్యాంకు సాధించి స్కూల్ అసిస్టెంట్‌గా ఎంపికయ్యారు.

### పండ్ల వ్యాపారం చేస్తూ...

* నర్సీపట్నానికి చెందిన విరోధి తరుణ్‌కుమార్ ఆర్డీవో కార్యాలయం రోడ్డులో తన సోదరుడితో కలిసి పండ్ల వ్యాపారం చేస్తూనే డీఎస్సీలో సెకండరీ గ్రేడ్ టీచర్‌గా 42వ ర్యాంకు సాధించారు.




### ఆర్మీ ఉద్యోగి నుండి మాస్టారు దాకా:

* అనకాపల్లి జిల్లా కె. కోటపాడు మండలం చౌడువాడకు చెందిన రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి బంటు శివ. 17 ఏళ్ల పాటు దేశానికి సేవ చేసి, రిటైర్ అయ్యాక బీఈడీ పూర్తి చేశారు. కానిస్టేబుల్ పోస్టుకు ఎంపికైనప్పటికీ, డీఎస్సీలో సోషల్ విభాగంలో 26వ ర్యాంక్ సాధించి ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. దేశ సేవ తర్వాత విద్యాసేవకు సిద్ధమయ్యారు.



### కూలీ పనులకెళ్తూ... తొలి ప్రయత్నంలోనే ఉద్యోగం:

* పల్నాడు జిల్లా పెదకూరపాడు మండలం జలాలపురం గ్రామానికి చెందిన ఆశాజ్యోతి తల్లిదండ్రులకు కూలీ పనుల్లో సహాయం చేస్తూనే చదివి, తొలి ప్రయత్నంలోనే స్కూల్ అసిస్టెంట్ (బయాలజికల్ సైన్స్) విభాగంలో 12వ ర్యాంకుతో సహా మూడు విభాగాల్లో ర్యాంకులు సాధించింది.






### ఉచిత శిక్షణ కేంద్రాల ప్రభావం

* కుప్పం నియోజకవర్గంలో ముఖ్యమంత్రి సతీమణి శ్రీమతి నారా భువనేశ్వరి ఆధ్వర్యంలో నడుస్తున్న ఎన్టీఆర్ ట్రస్టు డీఎస్సీ ఉచిత శిక్షణ కేంద్రం గొప్ప విజయాన్ని సాధించింది. ఈ కేంద్రంలో శిక్షణ తీసుకున్న వారిలో ఏకంగా 15 మందికిపైగా మెరిట్ సాధించి ఉపాధ్యాయులుగా అవకాశం పొందారు. వీరిలో తాపీ మేస్త్రీ కొడుకు, సచివాలయ ఉద్యోగి, కార్పెంటర్ కూతురు వంటి పేద కుటుంబాల అభ్యర్థులు ఉన్నారు.

ఈ నూతన ఉపాధ్యాయులు 'కల కనండి, దానిని సాకారం చేసుకోండి' అనే మాటకు నిలువెత్తు నిదర్శనంగా నిలిచి, రేపటి తరాలకు ఉత్తమ విద్యతో పాటు పట్టుదల విలువను కూడా నేర్పేందుకు సిద్ధమయ్యారని ఆశిద్దాం.

– **గణపతి రావు బెహరా**, పీఆర్వో, సమగ్ర శిక్ష
7732097027





# FLN - పటిష్టమైన పునాది

"మొక్కయి వంగనిది మానై వంగునా" అన్నది ఒక నానుడి. నిజమే ,మొక్క చిన్నగా ఉన్నప్పుడే తోటమాలి ఆ మొక్కకు కావాల్సిన పోషణ, రక్షణ ఇస్తే అదే మొక్క మహా వృక్షమై ఎంతో మందికి నీడను ఇస్తుంది మరియు మేలు చేస్తుంది. మరి బడిపూదోటలో అప్పుడే అడుగు పెట్టిన చిన్నారులు కూడా మొక్కలు వంటి వారే కదా. వారికి కావాలసిన సమగ్ర విద్యను మనం అందించ గలిగితే వాళ్ళు ఖచ్చితంగా మంచి పౌరులుగా ఎదుగుతారు. దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తారు.




NEP 2020 (నూతన జాతీయ విద్యా విధానం) ప్రతిపాదించిన 5+3+3+4 నిర్మాణంలో NCFFS 2022 ద్వారా మొదటి 5 సంవత్సరాలకు (ఫౌండేషనల్ స్టేజ్) సంబంధించి విద్యాప్రణాళిక రూపకల్పన ద్వారా పిల్లలకు ఆట ఆధారిత ,అన్వేషణ ఆధారిత మరియు సమగ్రమైన అభ్యాసనాన్ని అందించడానికి సిద్ధమైంది. ఈ విద్యా ప్రణాళిక కేవలం బట్టీ పద్ధతి కుండా సృజనాత్మకత, విమర్శనాత్మక ఆలోచన, సమస్యా పరిష్కార నైపుణ్యాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తుంది.

పిల్లల్లో సమగ్ర అభివృద్ధి జరగాలంటే ముందుగా ఉపాధ్యాయుల సామర్థ్యాలను పెంచాలనే ఉద్దేశంతో విద్యాశాఖ, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో వినూత్నంగా ఉపాధ్యాయులకు "జ్ఞానప్రకాష్", అంగన్వాడీ కార్యకర్తలకు "జ్ఞానజ్యోతి" సర్టిఫికేట్ కోర్సులను ప్రారంభించింది.

2026-27 నాటికి 2 వ తరగతికి చేరిన ప్రతి విద్యార్థి కనీస అభ్యసన సామర్థ్యాలు కలిగి ఉండాలనే లక్ష్యాన్ని ఏర్పరచుకుని ఆ దిశగా సంస్కరణలు చేపట్టి తొలి దశలో ఉపాధ్యాయులను బలోపేతం చేసి వారి ద్వారా పిల్లల అభ్యసనకు పటిష్టమైన పునాది వేయడానికి మన రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తుంది. ఇందులో భాగంగా ఆంగ్ల భాష బోధన మెలకువలను తెలుసుకుందాం .

**ఆంగ్ల భాషా బోధన:** ప్రాథమిక దశలో విద్యార్థులకు ఇంగ్లీష్ బోధించడం కష్టతరమే అయినప్పటికీ కొన్ని మెలకువల ద్వారా సులువుగా ఆంగ్ల భాషను నేర్పించవచ్చు. అదెలాగో ఇప్పుడు చూద్దాం. ఆంగ్లం విదేశీ భాషే అయినా మన ఒకటవ తరగతిలోకి అడుగు పెట్టేలోపే పిల్లలు అనేక ఆంగ్ల పదాలను నేర్చుకుని వస్తారు.. ఉదాహరణకు ఇంట్లో వాడే వస్తువులైన ప్లేట్, స్పూన్, గ్లాస్, బాటిల్ లాంటివి. అలాగే పరిసరాల నుండి aunty, uncle, cat, dog, road లాంటి పదాలు కూడా నేర్చుకుంటారు. ఆంగ్ల భాష బోధనకు LSRW (Listening, Speaking, Reading, Writing) పద్ధతి బాగా సహకరిస్తుంది.

**Listening (వినడం):** ఒకటో తరగతిలో పిల్లలకు ఆంగ్లం నేర్పించాలంటే ముందుగా వారికి ఇంగ్లీష్ రైమ్స్, చిన్న చిన్న ఆంగ్ల కథలు, ఆంగ్ల సంభాషణలు వంటి వాటిని మనం బిగ్గరగా పాడటం, చెప్పడం ద్వారా లేదా తరగతిలో లభ్యమయ్యే స్మార్ట్ టీవీ ద్వారా వినిపించాలి.

**Speaking (మాట్లాడడం):** తరగతి గదిలో ఉపాధ్యాయుల ఆంగ్లంలో చిన్నచిన్న వాక్యాలు మాట్లాడటం, (How are you?, What is your name? Who is your best friend?) ఆంగ్లంలో సూచనలు ఇవ్వడం, (Come in, please take your slate,Go in a line.) పదాలను సరైన ఫోనెటిక్ ఉచ్చారణతో చెప్పించడం (a సౌండ్స్ అ , b సౌండ్స్ బ్ ,c సౌండ్స్ క్ )... పిల్లలను ఆంగ్లంలో మాట్లాడేలా ప్రోత్సహించడం ద్వారా వారిలో భాషా జ్ఞానాన్ని పెంపొందించవచ్చు.

**Reading (చదవడం):** మీ తరగతిలో ప్రతి రోజూ కొద్ది సేపు కనీసం 10-15 నిమిషాలు చదవడానికి సమయం కేటాయించండి. ఆంగ్లంలో కథ లేదా సన్నివేశాన్ని చదివేటప్పుడు బిగ్గరగా సరైన ఉచ్చారణతో, భావవ్యక్తీకరణతో చదవండి. పిల్లల స్థాయికి తగిన ఆంగ్ల కథా పుస్తకాలను ఎంచుకోండి. అక్షరాలు వాటి శబ్దాలను వారికి అర్థమయ్యేలా నేర్పించండి. తరచుగా కనిపించే the, and, is లాంటి చిన్న పదాలను (సైట్ వర్డ్స్) గుర్తుంచుకోవడం నేర్పించండి. కథను రోల్ ప్లే చేయించడం, వారి సొంత మాటల్లో చెప్పించడం లాంటివి చేయించండి.

**Writing (రాయడం)** : రాయడం అనేది శారీరక శ్రమతో కూడిన ప్రక్రియ కాబట్టి పిల్లలకు పెన్సిల్ ను సరిగ్గా పట్టుకోవడం, స్థిరంగా కూర్చోవడం నేర్పించండి. ఆంగ్ల అక్షరాలు నేర్పాలంటే ముందుగా పిల్లలకు strokes నేర్పించాలి. పలక మీద గాని, ఇసుకలో గాని strokesను రాసి పిల్లలతో రాయించండి . ఆ తరువాత ట్రేసింగ్ పుస్తకంలో రాయించండి.. స్ట్రోక్స్ ఆధారంగా ఆంగ్ల అక్షరాలను రాయడం చాలా సులువుగా నేర్పించవచ్చు. క్యాపిటల్ ,స్మాల్ లెటర్స్ ను నేర్పించేటప్పుడు క్యాపిటల్ లెటర్స్, స్మాల్ లెటర్స్ ఒకేలా ఉండే వాటిని ముందు నేర్పించవచ్చు. కొంచెం తేడా తో రాయగలిగే స్మాల్ లెటర్స్ ను తరువాత నేర్పిస్తే ,పూర్తి తేడాతో ఉన్న స్మాల్ లెటర్స్ పై ప్రత్యేక శ్రద్ధ పెట్టవచ్చు.

పిల్లల్లో ఆంగ్ల భాషపై పట్టు రావాలంటే ఉపాధ్యాయులు తరచుగా వారితో ఆంగ్లంలో మాట్లాడాలి. వారికి ఆంగ్ల భాషా పునాదిని ప్రాథమిక స్థాయిలోనే వేయగలిగితే పిల్లలు ఆంగ్ల భాష అంటే భయం పోయి స్వేచ్ఛగా మాట్లాడగలుగుతారు.



– **నల్లమల్లి కుసుమ**,
లెక్చరర్, SIEMAT, సమగ్ర శిక్ష.



# బొమ్మ గీశానోచ్!



**గంటేడ కుందన** (4వ తరగతి),
పార్వతీపురం, మన్యం జిల్లా



**A.M.జనని** (7వ తరగతి)
శ్రీ వెంకటేశ్వర ఉన్నత పాఠశాల, తి.తి.దే, తిరుమల




**– పంపన దేవి మేఘన** 9వ తరగతి
S.P.P.P.R.Z.P.HIGH స్కూల్, పండ్లపాక, బిక్కవోలు మండలం, తూర్పుగోదావరి జిల్లా




**– బి.అర్చన,**
ఏపీ మోడల్ స్కూల్, ఎల్.ఆర్.పల్లి, అన్నమయ్య జిల్లా

# జ్ఞానేంద్రియాలం!

జ్ఞానేంద్రియాలం మేము
శరీరానికి కిటికీల వంటి వారము !
కలిసిమెలిసి ఉంటాం
చక్కగా చురుగ్గా పని చేస్తాం!!
కన్ను, చెవి, ముక్కు,
నాలుక, చర్మం మేమే
ఆ ఐదుగురం!!


కన్నులం మేం కన్నులం
కలువల్లాంటి కన్నులం
లోకాన్ని మీకు చూపుతాం
చల్లని నీటితో కడగండి
టీవీ,ఫోను అతిగా చూడకండి !
కంటి చూపుతో ఇబ్బంది పడకండి !!

చెవులం మేం చెవులం
రెండేసి చొప్పున ఉంటాం
వినుటకు మీకు అవసరం
చెవిలో వుందో పల్చనిపొర
కర్ణభేరి దాని పేరు
వినడంలో ముఖ్యపాత్ర దానిదే!
చెవిలో..
బలపాలు, పెన్నులు పెట్టకండి !
కర్ణభేరిని కొట్టకండి !
వినుటలో ఇబ్బంది పడకండి!!

ముక్కును నే ముక్కును
పొడవైన ముక్కును
వాసనను పసిగట్టగలను
ప్రాణ వాయువును పీలుస్తాను
ముక్కులో ఏమీ పెట్టకండి!
గాలి పీల్చడానికి ఇబ్బంది పడకండి!!

నాలుకను నే నాలుకను
నోట్లో ఉండే నాలుకను
రుచులను తెలిపే నాయికను
మాట్లాడుటకు నేను ముఖ్యం
రోజూ శుభ్రం చేయండి
అధిక వేడి, అధిక చల్లని
పదార్థాలు తినకండి!!

చర్మాన్ని నే చర్మాన్ని
మెత్తనైనా చర్మాన్ని





అవయవాలపై కప్పి ఉండే దాన్ని
స్పర్శ జ్ఞానం చెప్పేదాన్ని
మంటలకు, పదునైన వస్తువులకు
దూరంగా ఉండండి
రెండు పూటలా స్నానం చేయండి!
చర్మ వ్యాధులు రాకుండా చూసుకోండి!


జ్ఞానేంద్రియాలన్నింటిని
ఎప్పటికప్పుడు
శుభ్రంగా ఉంచాలి!
ఆరోగ్యంగా జీవించాలి!!
ఆరోగ్యమే మహాభాగ్యం

– **ఏడుకొండలు కళ్ళేపల్లి** *APO,*
*సమగ్ర శిక్ష, కృష్ణ జిల్లా, మచిలీపట్నం. 9490832338*

## రంగులు వేయండి



## చుక్కలు కలపండి




# దుప్పి కథ

అనగనగా ఒక ఊరిలో ఒక అడవి ఉండేది. ఆ అడవిలో ఒక దుప్పి ఉండేది. ఆ దుప్పి నీళ్లు తాగడానికి సెలయేటి దగ్గరకి వెళ్ళింది. దుప్పి నీళ్లు తాగుతూ ఆ నీళల్లో తన ప్రతిబింబం చూసుకుంది. నీళ్లలో చూస్తూ 'తన కొమ్ములు ఎంత పెద్దవో!' అనుకుంది. ఎంత బాగా ఎదుగుతున్న చూసి మురిసిపోయింది ఆ దుప్పి. తన కాళ్లు చూసుకుంది.

"ప్చ్... నా కాళ్లు మాత్రం చీపురు పుల్లల్లా ఉన్నాయి. ఏమీ బాగాలేవు" అనుకుంది. ఇంతలో హఠాత్తుగా ఒక సింహం తన మీదకు దూకబోవటం చూసింది. దుప్పి భయంతో పారిపోతూ పారిపోతూ అడవిలో చెట్ల గుబుర్లలోకి వెళ్లిపోయింది. దాని అందమైన కొమ్ములు చెట్ల కొమ్మలకు తగులుకొని ఇరుక్కుపోయాయి. సింహం దగ్గరకు వచ్చేస్తుంది. దుప్పి కొమ్ములు వదిలించుకోవడానికి ఎంతో ప్రయత్నం చేసింది. అదృష్టవశాత్తు సింహం మీద మీద పడే లోపలే కొమ్ములు బయటపడ్డాయి. 'బతుకు జీవుడా' అని దుప్పి వేగంగా పారిపోయింది. "నేను బాగాలేవు అనుకున్న పుల్లల్లాంటి కాళ్లు నన్ను కాపాడాయి. నేను మురిసిపోయిన కొమ్ములు నాకు ప్రాణం మీదకి తెచ్చిపెట్టాయి" అని అనుకుంది దుప్పి.

– **ఎం. రెడ్డి కుమార్,** *9వ తరగతి,*
*జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గాలివీడు, అన్నమయ్య జిల్లా*

# 2025 నోబెల్ బహుమతికి ఎంపికైన విజేతలు




నోబెల్ బహుమతులు ప్రపంచవ్యాప్తంగా అత్యంత ప్రతిష్ఠాత్మకమైన పురస్కారాలుగా గుర్తించబడినవి. ఈ బహుమతులను స్వీడన్ దేశానికి చెందిన శాస్త్రవేత్త, ఆవిష్కర్త, వ్యాపారవేత్త, దాత అయిన ఆల్ఫ్రెడ్ నోబెల్ (Alfred Nobel)స్మారకార్థం అందిస్తున్నారు. ప్రతి విజేతకు (laureate) బంగారు పతకం, ధ్రువపత్రం, నగదు బహుమతి అందిస్తారు.

ఆల్ఫ్రెడ్ నోబెల్ అక్టోబర్ 21, 1833 న స్వీడన్‌లోని స్టాక్‌హోమ్ నగరంలో జన్మించారు. ఆయన ఒక రసాయన శాస్త్రవేత్త, ఇంజనీర్, ఆవిష్కర్త. ఆయన 1867లో డైనమైట్ (Dynamite) అనే పేలుడు పదార్థాన్ని కనుగొన్నారు. ఈ ఆవిష్కరణతో ఆయనకు ప్రపంచవ్యాప్త ఖ్యాతి లభించింది. కానీ తన ఆవిష్కరణ యుద్ధాలలో విధ్వంసం కోసమే ఉపయోగించడాన్ని చూసి ఆయన చాలా బాధ పడ్డారు. దాంతో తన ఆస్తిని సమాజానికి ఉపయోగపడే విధంగా దానం చేయాలని అనుకున్నారు. 1895లో ఆయన తన వీలునామా (Will) లో రాసి, తన సంపదలో ఎక్కువ భాగాన్ని ఒక నిధిగా (fund) ఏర్పాటు చేయమని పేర్కొన్నారు. ఆ నిధి నుంచి ప్రతి సంవత్సరం శాంతి, సాహిత్యం, రసాయన శాస్త్రం, భౌతిక శాస్త్రం, వైద్య శాస్త్రం, ఆర్థిక శాస్త్రం రంగాల్లో మానవజాతికి విశేష సేవలందించిన వారికి బహుమతులు ఇవ్వాలని ఆయన సూచించారు. ఆల్ఫ్రెడ్ నోబెల్ 1896 డిసెంబర్ 10న మరణించారు. ఆయనను స్మరించుకుని ప్రతి సంవత్సరం డిసెంబర్ 10 న నోబెల్ బహుమతులు ప్రదానం చేస్తారు.

భౌతిక, రసాయన, వైద్య శాస్త్రాలు, సాహిత్యం బహుమతులు స్వీడన్‌లోని స్టాక్‌హోమ్ నగరంలో ప్రదానం చేస్తారు. శాంతి బహుమతి (Peace Prize) మాత్రం నార్వేలోని ఒస్లో (Oslo) నగరంలో ఇవ్వబడుతుంది. 1968లో స్వీడన్ సెంట్రల్ బ్యాంక్ ప్రారంభించిన ఆర్థిక శాస్త్రంలో నోబెల్ స్మారక బహుమతి (Nobel Memorial Prize in Economic Sciences) కూడా తరువాత చేర్చబడింది.

– **డా. ఎస్.వి. లక్ష్మణరావు**, సీఎంవో కన్సల్టెంట్, సమగ్ర శిక్ష

## భారతీయ మూలాలు కలిగిన నోబెల్ బహుమతి గ్రహీతలు

| పేరు | విభాగం | సంవత్సరం | ముఖ్య కృషి / కారణం |
|---|---|---|---|
| రబీంద్రనాథ్ టాగోర్ (Rabindranath Tagore) | సాహిత్యం (Literature) | 1913 | "గీతాంజలి" అనే కవితా సంపుటి ద్వారా భారత ఆత్మను ప్రపంచానికి పరిచయం చేశారు. ఆయనే నోబెల్ బహుమతి పొందిన తొలి భారతీయుడు. |
| సి.వి. రామన్ (C.V. Raman) | భౌతిక శాస్త్రం (Physics) | 1930 | రామన్ ప్రభావం (Raman Effect) అనే కాంతి వ్యత్యాస సూత్రాన్ని కనుగొన్నారు. |
| హర్ గోబింద్ ఖోరానా (Har Gobind Khorana) | వైద్య శాస్త్రం (Physiology or Medicine) | 1968 | జీన్స్ , ప్రోటీన్ నిర్మాణం మధ్య ఉన్న సంబంధాన్ని కనుగొన్నారు. |
| మదర్ తెరెసా (Mother Teresa) | శాంతి (Peace) | 1979 | కోల్కతాలో నిరుపేదల సేవ కోసం Missionaries of Charity సంస్థ ద్వారా చేసిన మానవతా సేవలకు గుర్తింపుగా బహుమతి పొందారు. |
| సుబ్రహ్మణ్యన్ చంద్రశేఖర్ (Subrahmanyan Chandrasekhar) | భౌతిక శాస్త్రం (Physics) | 1983 | నక్షత్రాల పరిణామం (Evolution of Stars) పై పరిశోధన చేసి "Chandrasekhar Limit" సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. |
| అమర్త్య సేన్ (Amartya Sen) | ఆర్థిక శాస్త్రం (Economics) | 1998 | పేదరికం, సామాజిక న్యాయం , మానవ అభివృద్ధి పై చేసిన ఆర్థిక విశ్లేషణలకు బహుమతి లభించింది. |
| వెంకట్రామన్ రామకృష్ణన్ (Venkatraman Ramakrishnan) | రసాయన శాస్త్రం (Chemistry) | 2009 | రైబోసోమ్ (Ribosome) నిర్మాణం , దాని క్రియాత్మకత పై చేసిన పరిశోధనకు గాను నోబెల్ బహుమతి అందుకున్నారు. |
| కైలాష్ సత్యార్థి (Kailash Satyarthi) | శాంతి (Peace) | 2014 | బాల కార్మికుల రక్షణ, బాలల హక్కుల కోసం చేసిన పోరాటానికి గాను బహుమతి లభించింది. (పాకిస్తాన్‌కు చెందిన మలాలా యూసఫ్ జాయ్ తో కలిసి పొందారు.) |

## 2025 సంవత్సరానికి నోబెల్ బహుమతికి ఎంపికైన విజేతలు

| విభాగం | విజేతలు | కారణం |
|---|---|---|
| భౌతిక శాస్త్రం (Physics) | John Clarke, Michel H. Devoret, John M. Martinis | "మాక్రో స్కేల్ లో క్వాంటమ్ మెకానికల్ టన్నెలింగ్ , విద్యుత్ సర్క్యూటులో ఎనర్జీ క్వాంటైజేషన్" |
| రసాయన శా స్త్రం (Chemistry) | Susumu Kitagawa, Richard Robson, Omar M. Yaghi | "మెటల్–ఆర్గానిక్ ఫ్రేమ్‌వర్క్‌లు (MOFs) అభివృద్ధి" |
| వైద్యశాస్త్రం / జీవవిజ్ఞానం (Physiology or Medicine) | Mary E. Brunkow, Fred Ramsdell, Shimon Sakaguchi | "పరిధి ఇమ్యూన టోలరెన్స్ (పరస్పర శరీరాన్ని దాడి చేయకుండా ఉండే రక్షణ విధానం)" |
| సాహిత్యం (Literature) | László Krasznahorkai | "ముప్పుగల భయభీత ప్రభావ మధ్య కళ యొక్క శక్తిని పునరుద్ధరించే సాహిత్యకార్యం" |
| శాంతి బహుమతి (Peace Prize) | María Corina Machado | "వెనెజులాలో ప్రజాస్వామ్య హక్కుల కోసం నిరంతర పోరాటం" |
| ఆర్థిక శాస్త్రాలలో నోబెల్ (Economic Sciences in Memory of Alfred Nobel) | Joel Mokyr, Philippe Aghion, Peter Howitt | "సాంకేతిక అభివృద్ధి ద్వారా స్థిరమైన వృద్ధికి అవసరమైన ప్రమాణాలను గుర్తించడం" , "సృజనాత్మక ధ్వంసం ద్వారాను వృద్ధి సిద్ధాంతం" |

తెలుసుకుందాం

# జనరల్ నాలెడ్జ్ బిట్స్

నిర్వహణ: **మజ్జి లీల**

## చరిత్ర (History)

1. భారతదేశంలో మొట్టమొదటి వైస్రాయ్ ఎవరు?
   జవాబు: లార్డ్ కానింగ్
2. 'క్విట్ ఇండియా' ఉద్యమం ఏ సంవత్సరంలో ప్రారంభమైంది?
   జవాబు: 1942
3. సింధు నాగరికత ప్రజల ప్రధాన దైవం ఎవరు?
   జవాబు: పశుపతి మహాదేవుడు
4. అశోకుడి శాసనాలను మొదట చదివిన వ్యక్తి ఎవరు?
   జవాబు: జేమ్స్ ప్రిన్సెప్
5. ఢిల్లీ సుల్తానేట్ ను స్థాపించినది ఎవరు?
   జవాబు: కుతుబుద్దీన్ ఐబక్
6. మొట్టమొదటి పానిపట్ యుద్ధం ఎప్పుడు జరిగింది?
   జవాబు: 1526
7. 'దీన్-ఇ-ఇలాహీ' మతాన్ని ప్రవేశపెట్టిన మొఘల్ చక్రవర్తి ఎవరు?
   జవాబు: అక్బర్
8. 'సతి' సహగమనాన్ని నిషేధించిన గవర్నర్ జనరల్ ఎవరు?
   జవాబు: విలియం బెంటింక్
9. భారత జాతీయ కాంగ్రెస్ స్థాపించబడిన సంవత్సరం?
   జవాబు: 1885
10. 'వేదాలకు తిరిగి వెళ్లండి' అని నినాదం ఇచ్చిన సంస్కర్త ఎవరు?
    జవాబు: స్వామి దయానంద సరస్వతి

## భౌగోళికం (Geography)

11. ప్రపంచంలో అత్యంత పొడవైన నది ఏది?
    జవాబు: నైలు నది
12. భారతదేశంలో అతిపెద్ద రాష్ట్రం (వైశాల్యం) ఏది?
    జవాబు: రాజస్థాన్
13. 'ఎర్ర గ్రహం' అని దేనిని అంటారు?
    జవాబు: అంగారకుడు (మార్స్)
14. భూకంపాలను కొలవడానికి ఉపయోగించే పరికరం ఏది?
    జవాబు: సిస్మోగ్రాఫ్
15. భారతదేశంలో అత్యంత పొడవైన తీరరేఖ కలిగిన రాష్ట్రం ఏది?
    జవాబు: గుజరాత్
16. సుందర్బన్స్ డెల్టా ఏ జంతువులకు ప్రసిద్ధి?
    జవాబు: రాయల్ బెంగాల్ టైగర్
17. సూర్యుడికి అత్యంత దగ్గరగా ఉన్న గ్రహం ఏది?
    జవాబు: బుధుడు (మెర్క్యురీ)
18. ప్రపంచంలో అత్యంత ఎత్తైన పర్వత శిఖరం ఏది?
    జవాబు: మౌంట్ ఎవరెస్ట్
19. 'బ్లూ ప్లానెట్' (నీలి గ్రహం) అని దేనిని అంటారు?
    జవాబు: భూమి
20. భారతదేశంలో అత్యంత పురాతన పర్వత శ్రేణి ఏది?
    జవాబు: ఆరావళి పర్వతాలు

## భారత రాజ్యాంగం (Indian Polity)

21. భారత రాజ్యాంగ నిర్మాతగా ఎవరిని పిలుస్తారు?
    జవాబు: డా. బి.ఆర్. అంబేద్కర్
22. భారత రాజ్యాంగం అమలులోకి వచ్చిన తేదీ?
    జవాబు: 1950 జనవరి 26
23. రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులను ఏ దేశం నుండి స్వీకరించారు?
    జవాబు: అమెరికా సంయుక్త రాష్ట్రాలు (USA)
24. ఓటు వేయడానికి కనీస వయస్సు ఎంత?
    జవాబు: 18 సంవత్సరాలు
25. రాజ్యసభకు అధ్యక్షత వహించేది ఎవరు?
    జవాబు: ఉపరాష్ట్రపతి
26. లోక్ సభలో అత్యధిక స్థానాలు ఉన్న రాష్ట్రం ఏది?
    జవాబు: ఉత్తరప్రదేశ్
27. ఒక రాష్ట్ర ముఖ్యమంత్రిని ఎవరు నియమిస్తారు?
    జవాబు: గవర్నర్
28. భారత సాయుధ దళాల సుప్రీం కమాండర్ ఎవరు?
    జవాబు: రాష్ట్రపతి
29. భారత రాజ్యాంగంలో ఎన్ని ప్రాథమిక విధులు ఉన్నాయి?
    జవాబు: 11
30. భారత రాజ్యాంగంలో ఆర్టికల్ 370 ఏ రాష్ట్రానికి సంబంధించింది?
    జవాబు: జమ్మూ కాశ్మీర్

## సాధారణ విజ్ఞానం (General Science)

31. నీటి రసాయన ఫార్ములా ఏమిటి?
    జవాబు: $H_2O$
32. కాంతి వేగం అత్యధికంగా దేనిలో ప్రయాణిస్తుంది?
    జవాబు: శూన్యం (Vacuum)
33. విద్యుత్ నిరోధకత (Resistance) యొక్క SI యూనిట్ ఏమిటి?
    జవాబు: ఓమ్ (Ohm)
34. మానవ శరీరంలో అతిపెద్ద గ్రంథి ఏది?
    జవాబు: కాలేయం (Liver)
35. డెంగ్యూ వ్యాధి ఏ దోమ కాటు వలన వ్యాపిస్తుంది?
    జవాబు: ఏడెస్ ఈజిప్టి (Aedes Aegypti)
36. ఆక్సిజన్‌ను కనుగొన్నది ఎవరు?
    జవాబు: జోసెఫ్ ప్రీస్ట్లీ
37. మానవ రక్తంలో ప్రధానంగా ఉండే లోహం ఏది?
    జవాబు: ఇనుము (Iron)
38. వాతావరణంలో అత్యధికంగా ఉండే వాయువు ఏది?
    జవాబు: నైట్రోజన్
39. సౌర శక్తిని విద్యుత్ శక్తిగా మార్చే ప్రక్రియ ఏమిటి?
    జవాబు: కిరణజన్య సంయోగక్రియ (ఇది మొక్కలలో శక్తిని ఉత్పత్తి చేసే ప్రక్రియ, సౌర శక్తిని విద్యుత్ శక్తిగా మార్చేది - ఫోటోవోల్టాయిక్ సెల్స్)
40. ధ్వనిని కొలిచే యూనిట్ ఏమిటి?
    జవాబు: డెసిబెల్ (dB)

*- మిగతా 23వ పేజీలో*

# సృజనాత్మక బోధనకు శ్రీకారం

**నేర్చుకోవాల్సింది.. నేర్పాల్సింది ఎంతో ఉంది.**

**డీ.ఎస్సీ–2025 ఉపాధ్యాయుల శిక్షణతో గొప్ప బోధనానుభూతి**

**విద్యార్థుల ఆలోచన సామర్థ్యాలకు పదును**

**అక్టోబరు 03 నుండి 10 వరకు 8 రోజుల శిక్షణ**

ఉపాధ్యాయుడంటే బడికి పోవడం పాఠాలు చెప్పడం కాదు పాఠశాల వాతావరణం, తరగతిగది బోధన, క్రమశిక్షణ, విద్యార్థులు పట్ల ఎలా ప్రవర్తించాలి, సహచర ఉపాధ్యాయుల పట్ల ఎలా మెలగాలి, బోధన అభ్యసన ప్రక్రియలు, వ్యూహాలు, టీచర్ హ్యాండ్ బుక్, మూల్యాంకనం పుస్తకాలు, లీప్ యాప్ తో పాటు పలు యాప్ ల ఉపయోగం, అకడమిక్ క్యాలెండర్, దీక్ష యాప్, క్లస్టర్ సమావేశాల నిర్వహణా విధానం, విద్యార్థి సమగ్ర నివేదిక పుస్తకం, విద్యాశాఖలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా పథకాలు, వార్షిక ప్రణాళిక, పాఠ్య ప్రణాళిక, పీరియడ్ ప్రణాళిక, బోధనలో బోధనోపకరణాల వినియోగం, విద్యార్థుల తల్లిదండ్రుల కమిటీతో సత్సంబంధాలతో పాటు పాఠశాల అభివృద్ధిలో భాగస్వామ్యం తదితర అంశాలపై అక్టోబరు 03వ తేది నుండి నుండి 10 వ తేదీ వరకు 8 రోజుల పాటు రోజుకొక ప్రణాళికతో పూర్తి స్థాయిలో తర్ఫీదు ఇచ్చి పాఠ్య బోధనకు భావి ఉపాధ్యాయులను సన్నద్ధం చేసే అమూల్యమైన అవకాశం రావడం గర్వంగా ఉంది.

ఇప్పటి సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు సైతం శిక్షణ ఇవ్వని కొన్ని అంశాలను డి.ఎస్సీ –2025 ఉపాధ్యాయులకు శిక్షణతో పాఠశాలలోకి అడుగుపెట్టడం వారి బోధనా జీతానికి తొలిమెట్టు కావడం విశేషం. ఈ శిక్షణ నూతన ఉపాధ్యాయులకు ఎంతో ఉపయుక్తంగా ఉండటంతో పాటు వారి సర్వీసులో చేరిన రోజు ఏ ఉత్సాహంతో బోధన ప్రారంభిస్తారో అదే ఉత్సాహంతో ఎప్పటికప్పుడు మారుతున్న కాలానికి అనుగుణంగా పాఠ్య బోధనలో మెలకువలను మనం నేర్చుకుని, విద్యార్థులకు నేర్పాలనే ఆశయం వారిలో కల్పించి పదవీవిరమణ వరకు ఆదర్శవంతంగా ఉంటూ, భవిష్యత్తు బోధనకు బాసటగా, కొత్త ఉపాధ్యాయుల బాధ్యతలు, విధులతో పాటు ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేసేలా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం, పాఠశాల విద్యాశాఖ ఈ గొప్ప శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయం.

– **యువశ్రీ మురళి**, తెలుగు విషయనిపుణులు, తిరుపతి జిల్లా



# జాతిపితకు జేజేలు



బోసి నవ్వుల బాపూజీ
పుట్టినరోజు ఈ రోజు
భరతమాత మురిసిన రోజు
దేశమంతా పండుగ రోజు
భరతమాత దాస్య విముక్తి కోసం
సలిపెను శాంతియుత పోరాటం
తెల్లదొరలు పాలిట సింహం స్వప్నం
మాతృమూర్తికి తొలిగిన దాస్యం

సత్యం అహింసలనే ఆయుధాలుగా నెంచెను
పరమత సహమే గొప్పదని తలచెను
సర్వమత సారం ఒకటేనని చాటేను
జాతిజనులకు కరదీపికై నిలిచెను
విదేశీయతకు శ్రీకారం చుట్టెను
స్వయంగా చరఖా పై ఖద్దరు నేసేను
స్వదేశీయతను చాటి చెప్పెను
కాలానికి తానే నిలువెత్తు రూపమట
గడియారం మొలకే ధరించెనట
పనులెన్నిటినో చక చక చేసెనట
కలం విలువను చాటి చెప్పినట
సత్యమేవ జయతే అని నినదిస్తూ
అహింస పరమో ధర్మ: అని చాటుతూ
స్వాతంత్ర్యోద్యమ సారథివై గెలిచావు
జాతి జనులకు జాతిపితగా నిలిచావు.

– **చాడ శ్రీనివాస్,** స్కూల్ అసిస్టెంట్ తెలుగు,
ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్, శ్రీకాకుళం
9912160860

# చదువంటే...

**చ** చక్కని సంస్కారాన్ని నేర్పి
**దు** దుర్భరమైన జీవితమనే అజ్ఞానాన్ని తొలగించి
**వు** ఉజ్వల భవిష్యత్ కు మార్గాలు చూపించే దిక్సూచి

– **అళహరి వెంకటేష్,** నెల్లూరు, 9618325082

*– 21వ పేజీ తరువాయి*

## క్రీడలు (Sports)

41. క్రికెట్ లో 'గాడ్ ఆఫ్ క్రికెట్' అని ఎవరిని పిలుస్తారు?
జవాబు: సచిన్ టెండూల్కర్
42. 2024 ఒలింపిక్ క్రీడలు ఎక్కడ జరిగాయి / జరగనున్నాయి?
జవాబు: పారిస్, ఫ్రాన్స్
43. సానియా మీర్జా ఏ క్రీడకు సంబంధించినది?
జవాబు: టెన్నిస్
44. భారతదేశ జాతీయ క్రీడ ఏది?
జవాబు: హాకీ
45. ఫుట్ బాల్ ఆటలో ఎంత మంది ఆటగాళ్లు ఉంటారు?
జవాబు: 11
46. 'థామస్ కప్' ఏ క్రీడకు సంబంధించినది?
జవాబు: బ్యాడ్మింటన్
47. ఒలింపిక్ చిహ్నంలో ఎన్ని వలయాలు (Rings) ఉంటాయి?
జవాబు: 5
48. గోల్ఫ్ క్రీడ ఆడే మైదానాన్ని ఏమంటారు?
జవాబు: కోర్స్ (లేదా గోల్ఫ్ కోర్స్)
49. విరాట్ కోహ్లీ ఏ క్రీడకు సంబంధించిన వాడు?
జవాబు: క్రికెట్
50. 'డ్రాప్ షాట్' అనే పదం ఏ క్రీడలో ఉపయోగిస్తారు?
జవాబు: టెన్నిస్ / బ్యాడ్మింటన్

# దీపావళి దీపావళి

దివ్య దీపావళి భవ్య దీపావళి
వెలుగులు తెచ్చు దీపావళి
జీలుగులు తెచ్చు దీపావళి
బతుకుల్లో కాంతి నింపు దీపావళి
పేదల ఆకలి తీర్చు దీపావళి
నింగిలోని నక్షత్రాలను నెలకు డించిన దీపావళి
కాంతులు పంచిన దీపావళి
సత్యభామ చనుబాలు దీపావళి
కృష్ణుడు దౌత్యం దీపావళి
మంచిదైన దీపావళి చెడుకాని దీపావళి
అమ్మ దీపావళి అమ్మ కన్నులోన్ని కాంతి దీపావళి
చంటి పాప అల్లరి దీపావళి
పడతి చంకలో పిల్ల దీపావళి
తాత బోసినోటి నవ్వుపువ్వు దీపావళి
జీవిత రంగుల వలయం దీపావళి
ప్రకృతి తల్లీ మయాజాలం దీపావళి
అమూవాస్య కన్య అందం దీపావళి
అసుర సంహార ఆయుధం దీపావళి
స్త్రీ నడుమున దోపు పైట కొంగు దీపావళి
తరతరాల స్త్రీ నెత్తురులో పటుత్వం దీపావళి
రమ్య రవళి దీపావళి కమ్మని కవిత దీపావళి
ఆకాశంలో సగం దీపావళి అవకాశంలోసగం దీపావళి
అతివుల అందం దీపావళి సబలలచాతుర్యం దీపావళి

**– రాళ్లబండి సంగం నాయుడు,**
*జరజాపు పేట, నెల్లిమర్ల, విజయనగరం, 9490935268*



## Samagra Shiksha Official (AP)

Official entity of Department of School Education,
Govt. of Andhra Pradesh

Scan the QR Code &
Follow Samagra Shiksha

Samagra's Official **WhatsApp Channel**
Samagra's Official **YouTube Channel**
Samagra's Official **Instagram Page**
Samagra's Official **Facebook Page**
Samagra's Official **X (Twitter)**
Samagra's Official **LinkedIn Page**

One stop for official Announcements & Initiativesfrom Andhra's Education Department

Published by the **State Project Director**, Samagra Shiksha, Andhra Pradesh.
K.B.C ZillaParishad High School (Boys) Premises, High School Road, Patamata, Vijayawada - 520 010. A.P.
For mail: manabadimagazine@gmail.com
Present : **B.Srinivasa Rao,** I.A.S., Printed by : **M/s. Lakshmi Vignesh Printers,** Guntur